## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్, అల్లాహ్ తాలా దయతో క్షేమంగా యున్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి ఆయురారోగ్యముల కొరకు, ఉన్నత ఆశయ సాధనాల కొరకు, వారి ప్రత్యేక రక్షణ కొరకు దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ ను అనుక్షణం రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్).*

اَللّٰهُمَّ اَیِّدۡ اِمَامَنَا بِرُوۡحِ الۡقُدُسِ
وَبَارِکۡ لَنَا فِیۡ عُمُرِہٖ وَاَمۡرِہٖ

بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

**సంపాదకులు:** సయ్యద్ రసూల్ నియాజ్
**ఉపసంపాదకులు:** ముహమ్మద్ అక్బర్

# బదర్
(Telugu)వార పత్రిక
Weekly BADAR
Qadian

సంపుటి 6 సంచిక 50
వార్షిక చందా 575/-రూ॥

www.akhbarbadrqadian.in

**16 డిసంబర్, 2021 క్రీ, శ.** **16 ఫతహ్, 1400 హి, శ.**
**11 జమాదిఉల్ అవ్వల్ 1443 హి, ఖ.**

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

وَهُوَ اللّٰهُ فِی السَّمٰوٰتِ وَفِی الۡاَرۡضِ ؕ
یَعۡلَمُ سِرَّکُمۡ وَجَهۡرَکُمۡ
وَیَعۡلَمُ مَا تَکۡسِبُوۡنَ

అనువాదం: ఆకాశములలో కూడ భూమిపై కూడ అల్లాహ్ వ్యాపించి యున్నాడు. మీ ప్రత్యక్ష, పరోక్షములను కూడ అతడు ఎరుగును. మీరు ఆర్జించు నదంతయు ఎరుగును.
(అన్ఆమ్: 4)

నిజమైన విశ్వాసం మానవునిలో జనించినప్పుడు ఆచరణలో ఒక అనుభూతి కల్గుతుంది. అతని దైవజ్ఞాన దృష్టి కూడ తెరుచుకోబడుతుంది. నమాజ్‌ను ఏ విధముగా చదవవలెనో ఆ విధముగా అతడు చదువును. ఫలితముగా పాపముల పట్ల అయిష్టత పెరుగుతుంది.

**ఉపదేశము: సయ్యదినా హజ్రత్ మసీహ్ మౌవూద్ వ మహ్దియే మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం.**

మీ విశ్వాసాన్ని తూకం వేసి చూసుకోండి, ఆచరణలు విశ్వాసానికి ఆభరణం వంటివి. ఒకవేళ ఆచరణ స్థితి సరిగా లేనిచో వాస్తవానికి విశ్వాసం కూడ లేదనే భావించుకోవాలి. విశ్వాసుడు అందగాడిని పోలి ఉంటాడు. ఒక అందగాడికి సాధారణమైన, తేలికైన కడియంను తొడిగిన కూడ ఆ కడియం అతని అందాన్ని ఇంకా ఎక్కువ అందగాడి వలే కనబడునట్లు చేస్తుంది. అదే విధముగా ఒక విశ్వాసుడిని కూడ సత్కార్యము ఇంకా అందముగా కనబడునట్లు చేస్తుంది. ఒకవేళ దుష్కార్యములు చేయుచున్నచో ఏమియును మిగులదు. నిజమైన విశ్వాసం మానవునిలో జనించినప్పుడు ఆచరణలో ఒక అనుభూతి కల్గుతుంది. అతని దైవజ్ఞాన దృష్టి కూడ తెరుచుకోబడుతుంది. నమాజ్‌ను ఏ విధముగా చదవవలెనో ఆ విధముగా అతడు చదువును. ఫలితముగా పాపముల పట్ల అయిష్టత పెరుగుతుంది. అసభ్యకర సమావేశాల పట్ల ద్వేషం కల్గుతుంది. అల్లాహ్ మరియు అతని సందేశహరుని గౌరవం, ప్రకాశం బహిర్గతం కావడం కోసం తన మనస్సులో ఒక ఉత్సాహం, ఒక తపన కల్గడాన్ని గమనిస్తుంటాడు. అట్టి విశ్వాసమే అతనిని మసీహ్ అలైహిస్సలాం వలే సిలువను ఎక్కుటకు అవరోదముగా నిలువదు, అతడు దేవుని కొరకు ప్రత్యేకించి దేవుడి కొరకు ఇబ్రాహీం అలైహిస్సలాం వలే మంటలలో పడిపోవుటకు కూడ సిద్ధముగా ఉండును. అతడు ఎప్పుడైతే తన అభిష్టాన్ని దైవ అభిష్టానికి అనుగుణముగా మలుచుకుంటాడో అప్పుడే మనో ఆంతర్యములను, పాతాళ లోకాలను ఎరిగినటు వంటి అల్లాహ్ వారి సంరక్షకుడిగా, పర్యవేక్షకుడిగా మారుతాడు. అప్పుడు అతడు సిలువపై నుండి కూడ ప్రాణాలతో దింపుతాడు. మంటలలో నుండి కూడ సురక్షితముగా బయటకు తీసుకవస్తాడు. దేవున్ని మనస్పూర్తిగా విశ్వసించువారే ఈ అద్భుతాలను సందర్శించుకుంటారు.

మొత్తానికి అబూబకర్ రజి గారి నిజాయితి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను ముట్టడి చేసిన సమయంలో వెలువడిన అల్లరుల సమయంలో బహిర్గతమైనది. నిజానికి కొందరు వెలివేయాలని భావించిన కూడ ఆ నిర్ణయం వెనుక గల ఉద్దేశం హుజూర్ (స)ను హతమార్చడమే. అలాంటి పరిస్థితులలో హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ తమ నిజాయితి, విధేయతతో కూడిన ఆదర్శాన్ని ప్రదర్శించారు. ఆ ఆదర్శం ప్రళయ దినం వరకు ఉదాహరణగానే మిగులుతుంది. ఆలాంటి క్లిష్ట సమయంలో ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ అబూబకర్ రజిను సహచరుడిగా ఎన్నుకోవడంలో హజ్రత్ సిద్దీఖ్ రజి గారి వైభవము మరియు ఉన్నత విధేయతకు ఒక బలమైన నిదర్శనం. ఒక్కసారి ఆలోచించండి. ఒకవేళ భారత దేశ వైస్రాయి ఒక వ్యక్తిని ఒక ప్రత్యేక కార్యాచరణ కొరకు ఎన్నుకున్నచో ఆ ఎన్నిక శ్రేయస్కరమైనది, ఉత్తమమైనది అవుతుందా? లేకా ఒక కాపాలా దారుడిదా?. వైస్రాయి ఎన్నిక సరైనదని, శ్రేయస్కరమైనదని అంగీకరించ వలసి ఉంటుంది. ఎందుకనగా అతడు రాజ్యాధికారి వైపు నుండి ఉపరాజ్యాధికారిగా ఎన్నుకోబడ్డాడు. కావున అతని విధేయత, వినమ్రత, దూరదృష్టి, అనుభవంపై రాజ్యాధికారికి పూర్తి నమ్మకమున్నది. అందుకే రాజ్యాధికారపు బాధ్యతను అతని చేతికి అప్పగించబడింది. అలాంటప్పుడు అతని వ్యూహరచనను, కార్య సమాలోచనను లెక్కచేయకుండా ఒక కాపాల దారుడి ఎన్నికను, అతని అభిప్రాయాన్ని సరైనదని ధ భావించడం ఎంత వరకు సమంజసం అవుతుంది.? (మల్ఫూజాత్, సంపుటి 1, పుట 340, ప్రచురణ ఖాదియాన్ 2018)

## మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు

(1597) హజ్రత్ ఉమర్ రజియల్లాహ్ అన్హు ఈ విధముగా ఉల్లేఖించారు. వారు హజరే అస్వద్ వద్దకు వచ్చారు. దానిని ముద్దాడారు. ఆపై దానిని ఉద్దేశించి ఇలా అన్నారు: నీవు ఒక రాయివని, ఎలాంటి లాభాన్ని గాన్ని, నష్టాన్ని గాన్ని నీవు చేకూర్చలేవని నాకు తెలుసు. కాని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహివసల్లం నిన్ను ముద్దాడుచుండగా నేనే చూడనిచో నేను కూడ నిన్ను ఏ మాత్రం ముద్దాడే వాడిని కాదు.

హజ్రత్ సయ్యద్ జైనులాబిద్దీన్ వలీ ఉల్లాహ్ షా రజి గారు ఈ హదీస్‌ను విశ్లేషిస్తూ ఈ విధముగా తెలిపారు:అరబ్‌లు, అరబ్బేతర అన్యారాధుల జాతులు స్థాపించబడిన రాళ్ళను పూజించేవారు. అందుకు కారణం అవి లాభ నష్టాలను చేకూర్చు శక్తులను కల్గియున్నాయని వారు భావించేవారు. కాని హజ్రత్ ఉమర్ రజి వారి అన్యారాధన భావాలను ఖండించారు. తద్వారా అజ్ఞాన ముసల్మానులు ఈ హజరే అస్వద్ విషయంలో ఎలాంటి పొరపాటుకు గురి కాకూడదని భావించారు. ఆరాధనలలో పొగడ్తలు, స్మరించుకోవడాలు, ఆకాంక్షలు, నమ్మకాలు, దుఆలు అన్ని కలిసి ఉంటాయి. కావున ఈ హజరే అస్వద్‌ను ముద్దాడడంలో పైన పేర్కొనబడిన ఏ ప్రత్యేకత మనకు కనిపించదు. అదే విధముగా స్వయముగా హజరే అస్వద్ కూడ ముద్దాడ బడుటకు గాని, పట్టుకోబడడానికి గాని ప్రత్యేకించ బడలేదు. మరి కొన్ని కథనాల ద్వారా తెలియున దేమనగా, యమన్ వైపు ఉన్న స్థంభం కూడ ముద్దాడ బడుతుంది. (సహి బుఖారి, సంపుటి 3, కితాబుల్ హజ్, ప్రచురణ ఖాదియాన్ 2008)

### అల్లాహ్ తాలా ఏదేని విషయంలో వాగ్దానం చేసినచో ఆ వాగ్దానం అన్ని రకాల శుభములతో పూర్తి గావించబడుటకు ప్రత్యేకతతో దుఆలు మరియు ప్రార్ధనలలో నిమగ్నమైపోవాలి.

సయ్యదినా హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహ్ అన్హు అల్ హుజరాత్ అధ్యాయపు 100వ సూక్తి వఅబుద్ రబ్బక హత్తా యాతియకల్ యఖీన్ ను విశ్లేషిస్తూ ఇలా తెల్పుచున్నారు: ఇక్కడ నమ్మకానికి సరైన అర్ధమేమనగా మరణం. అనగా ఇక నీవు నీ మరణం వరకు ఆరాధనలో నిమగ్నమైపొమ్ము. అనగా ఇస్లాంకు లభించే విజయాలలో ఇక ఎలాంటి ఆటంకాలు ప్రభావాన్ని చూపవు. కావున ఇక నీవు మనస్పూర్తిగా దేవుని దాసులతో కలసి నీ మరణం వరకు ఆరాధనలు చేయుము. నేడు నీ ఆరాధనలలో ఆటంకాలు ఏర్పర్చుతున్న ఈప్రజలను అల్లాహ్ తాలా ఎలా నామ రూపాలు లేకుండా చేయుననగా, నీ జీవితంలో ఇక ఎన్నడు కూడ ఎలాంటి ఆటంకం లేకుండా స్వతంత్రముగా, స్వేచ్ఛగా ఆరాధనలు చేసుకొందువు.

ఇక్కడ నమ్మకానికి అవగాహన అనే అర్ధం కూడ వచ్చును. అప్పుడు ఈ వాక్యపు అర్ధం ఏ సమయం కోసం నీతో వాగ్దానం చేయబడిందో ఆ సమయం వచ్చు వరకు నీవు ఆరాధనలో నిమగ్నమైపొమ్ము. కావున ఇక్కడ దేవుని వైపు నుండి లభించు శిక్ష లేదా విజయ క్షణపు ఆనవాళ్ళు కనిపించుటను నమ్మకమని పేర్కొనడమైనది. ఎందుకనగా వాగ్దానం పూర్తి గానంత వరకు పూర్తి వాస్తవికత బహిర్గతం కాదు. అందుకే ఇలా తెలిపాడు. దేవుని వైపు నుండి వాగ్దానం చేయబడినప్పుడు అట్టి వాగ్దానాలు అన్ని రకాల శుభములతో పూర్తి గావించ బడుటకు ప్రత్యేకతతో దుఆలు మరియు ప్రార్ధనలు చేయవలెను. (తదుపరి సంచికలో)

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

## సంపాదకీయం:-

### ఖత్మే నబువ్వత్ యొక్క వాస్తవికత మరియు అహ్మదియ్యా జమాఅత్ యొక్క విశ్వాసాలు:

مَا كَانَ مُحَمَّدٌ اَبَآ اَحَدٍ مِّنۡ رِّجَالِكُمۡ وَلٰـكِنۡ رَّسُوۡلَ اللّٰهِ وَخَاتَمَ النَّبِيّٖنَ‌ؕ وَكَانَ اللّٰهُ بِكُلِّ شَىۡءٍ عَلِيۡمًا

అనువాదము: ముహమ్మద్ మీ వలె నున్న పురుషులలో ఎవరికి తండ్రి కారు. వారు అల్లాహ్ ప్రవక్త, సందేశహరులనందరిని ధృవపరచునట్టివారు. అల్లాహ్ సర్వజ్ఞుడు.(అల్ అహ్‌జాబ్:41)

ఈ సూక్తి అనుసారము జగత్ ప్రవక్త, హ॥జ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం నిస్సందేహముగా ఖాతమున్నబియ్యాన్ అని అహ్మదియ్యా జమాఅత్ మొత్తం విశ్వాసము. ఈ విషయములో ముస్లిముల ఒక్క వర్గములో కూడ విభేదము రాలేదు, లేదు, భవిష్యత్తులో కూడ రాదు. కాని పరిశోధించవలసిన విషయమేమనగా ఖాతమున్నబియ్యాన్ అర్థము, భావమేమిటి ? ఖత్మే నబువ్వత్ అనగా వరము అంతమగుటనా లేదా లాభము, వరము కొనసాగుటనా ? ఈ శీర్షిక గురించి అభిప్రాయము తెలుపుట నేటి ఉద్దేశము.

అహ్మదియ్యా జమాఅత్ ఆంహ॥జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను హృదయపూర్వకంగా ఖాతమున్నబియ్యాన్ అని విశ్వసించును. ఖత్మే నబువ్వత్ యొక్క తిరస్కరణ ఆరోపణ చేయు వ్యక్తి హృదయములోని ఒక కోణములో దొంగ దాగి యున్నాడని మేమతని గురించి నమ్మకముగా చెప్పగలము. ఈ విషయమును దాచిపెట్టుటకు అతను తన హృదయ చీకటిని అహ్మదియ్యా జమాఅత్ యదపై వెదజల్లి సంతృప్తి పడుచున్నాడు. వాస్తవానికి జామిఅ మస్జిద్ ఢిల్లీలో అహ్మదియ్యా జమాఅత్ స్థాపకులు హ॥జ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ మసీహ్ మౌవూద్, మహ్దీ మాహూద్ అలైహిస్సలాం తమ విశ్వాసములను వ్యక్తపరచుచు స్పష్టమైన పదములలో ఇట్లనిరి.

"నేను విస్తారముగా ఈ క్రింది విషయములను ముస్లిముల ముందు ఈ దైవ గృహములో స్పష్టముగా తెలుపుచున్నాను. గౌ॥ ఖాతముల్ అన్బియా సల్లల్లాహు అలైహి వసల్లం ఖత్మే నబువ్వత్‌ను నేను విశ్వసిస్తాను. ఖత్మే నబువ్వత్‌ను విశ్వసించని వ్యక్తిని అధర్ముడని, ఇస్లాం నుండి బహిష్కృతుడని భావించెదను."

(తఖ్రీర్ వాజిబుల్ ఈలాన్, తబ్లీఘె రిసాలత్ సంపుటి 2 పుట 44)

ఖత్మే నబువ్వత్‌ను నమ్మరను ఈ భయానక ఆరోపణను ఖండించుచు వారిట్లనిరి. ''మేము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఖాతమున్నబియ్యాన్ అని విశ్వసించమని నాపై, నా జమాఅత్‌పై మోపుచున్న ఆరోపణ ఒక పెద్ద నింద. మేము ఎంత శక్తి, నమ్మకము, జ్ఞానము, అనుభవముతో ఆంహ॥జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఖాతముల్ అన్బియా అని నమ్ముతామో, విశ్వసిస్తామో దాని లక్షల వంతు కూడ ఇతరులు నమ్మరు. వారి స్థాయి ఇది కానే కాదు. ఖాతముల్ అన్బియాలో నున్న వాస్తవము, గోప్యతను అర్థము చేసుకొనే చేసుకోరు. వారు తాత ముత్తాతల నుండి కేవలం ఒక పదమును వినియున్నారు. కాని దాని వాస్తవికత వారికి తెలియదు, ఖత్మే నబువ్వత్ ఏమిటో, దానిని విశ్వసించే భావమేమిటో తెలియదు. కాని మేము పూర్తి అనుభవముతో (దానిని అల్లాహ్ తాలా బాగుగా ఎరుగును) ఆంహ॥జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఖాతముల్ అన్బియా అని నమ్ముతాము. అల్లాహ్ తాలా ఖత్మే నబువ్వత్ వాస్తవికతను మాకు ఏ విధముగా తెలిపెననగా మాకు త్రాగించిన విజ్ఞాన పానీయముతో మేమొక ప్రత్యేక ఆనందము పొందుతాము. ఈ చెలిమ నుండి త్రాగిన వారు తప్ప దానిని ఎవరు అంచనా వేయలేరు."

*(మల్ఫూజాత్ సంపుటి 1 పుట 241, 242)*

ఇంతే కాక వారు ప్రమాణపూర్వకముగా ఈ ప్రకటన చేసిరి.

"నేను అల్లాహ్ గౌరవ, వైభవ సాక్ష్యముగా చెప్పుచున్నాను. నేను విశ్వాసిని, ముస్లిమును. నేను అల్లాహ్ తాలా, అతని పుస్తకములు, అతని ప్రవక్తలు, అతని దేవదూతలను, మరణము తరువాతి జీవితమును విశ్వసిస్తాను. మన ప్రవక్త ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం సర్వ ప్రవక్తలలో ఉత్తములు, ఖాతమున్నబియ్యాన్ అని నా విశ్వాసము."

*(అరబ్బీ పంక్తి అనువాదము: హమామతుల్ బుష్రా పుట 8)*

అహ్మదియ్యా జమాఅత్ స్థాపకుల పదములలో అహ్మదియ్యా జమాఅత్ ప్రతి సభ్యుడు బహిరంగముగా ఇట్లు డప్పు సాటింపు చేయుచున్నాడు, చేయుచు పోవును.

ہم تو رکھتے ہیں مسلمانوں کا دیں دل سے ہیں خدام ختم المرسلیں

మేము ముస్లిముల ధర్మమును పాటిస్తాము. మనస్ఫూర్తిగా మేము ఖత్ముల్ ముర్సలీన్ సేవకులము

شرک اور بدعت سے ہم بیزار ہیں خاک راہ احمد مختار ہیں!

అన్యారాధన, దురాచారమును మేము ద్వేషిస్తాము. మేము సర్వాధికారి అహ్మద్ (సల్లం) మార్గ ధూళిమి

تم ہمیں دیتے ہو کافر کا خطاب کیوں نہیں لوگو تمہیں خوف عقاب

(ఓ వ్యతిరేకులారా!) మాకు మీరు అవిశ్వాస బిరుదునిస్తారు. మీకు శిక్ష గురించి ఎందుకు భయము లేదు.

కాని విచిత్రము, విపరీత దౌర్జన్యమేమనగా ఇంత స్పష్టమైన, గట్టి ప్రకటనలు, అంగీకారము, ప్రమాణ పూర్వక వ్యాఖ్యానమును లెక్క చేయకుండా గత వంద సం॥ల నుండి వ్యతిరేక విద్యావంతులు అహ్మదియ్యా జమాఅత్‌పై "ఖత్మే నబువ్వత్ తిరస్కరణ" బాణములతో విరుచుకుపడుచున్నారు. "తహఫ్ఫుజె ఖత్మే నబువ్వత్" పేరున రాజకీయ నాయకులు, వారు కొనుగోలు చేసిన ముల్లాలు సామాన్య స్వభావము గల ముస్లిముల మనోభావాలను రెచ్చగొట్టడమే కాక ఇస్లామీయ అభిప్రాయములను, సూత్రములను, స్వయముగా తమ విశ్వాసములను అతి నీచము, హీనంగా అవహేళనకు గురి చేసిరి. ఎందుకగా స్వార్థపరులైన ఈ ముల్లాలు ఒక వైపు ఆంహ॥జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖత్మే నబువ్వత్‌ను ఏ విధముగా నమ్ముతారనగా వారి తరువాత ప్రళయ దినము వరకు ఎటువంటి ప్రవక్త అవతరించడు. ఒక్క శ్వాసలోనే రెండవ వైపు ఒక దొంగ తలుపు తెరిచి ఖత్మే నబువ్వత్ కోటకు రంధ్రము చేసి ఆంహ॥జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం కంటే 6 వందల సం॥ క్రితం హ॥జ్రత్ మూసా అలైహిస్సలాం శాసనము తౌరాత్ సేవకు స్వతంత్ర, నేరుగా అల్లాహ్ తాలాతో ప్రవక్తృతవము పొంది, అవతరించిన హ॥జ్రత్ ఈసా అలైహిస్సలాం ముహమ్మదీయ సమాజ సంస్కరణ కొరకు వచ్చెదరని అందురు. వారు ప్రవక్తగా వత్తురు. వారు రెండవ సారి ముహమ్మదీయ సమాజములో ప్రవక్తగా అవతరించినను ఖత్మే నబువ్వత్‌లో ఎలాంటి అభ్యంతరము ఏర్పడదని అందురు. ఇది వ్రతం చెడరాదు-సత్యం మానరాదు అన్నట్లున్నది.

ఈ రెండు విశ్వాసములలో స్పష్టమైన తేడా యుండడమే కాక దీనితో ఆంహ॥జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అవమానముతో పాటు వారి స్థాయిలో భేదము ఏర్పడును. నవూజుబిల్లాహ్ హుజూరె అక్రమ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రపంచములో శాశ్వతముగా దైవ అనుగ్రహ చెలిమలను మూసివేసిరి. వారి సమాజము ఉత్తమ సమాజమైనను ఇతర జాతికి చెందిన ఒక ప్రవక్త అవసరము వచ్చెను. వాస్తవానికి పవిత్ర ఖుర్‌ఆన్ హ॥జ్రత్ ఈసా అలైహిస్సలాంను "وَرَسُوۡلًا اِلٰى بَنِىۡۤ اِسۡرَآءِيۡلَ" (ఆలె ఇమ్రాన్:50) అని పేర్కొనెను. వారు ఇస్రాయీల్ సంతతికి మాత్రమే ప్రవక్త. వారు ముహమ్మదీయ సమాజము కొరకు ప్రవక్త కానే కాదు. ప్రత్యేకంగా పవిత్ర ఖుర్‌ఆన్ ఒకటి రెండు కాదు 30 సూక్తులతో హ॥జ్రత్ ఈసా అలైహిస్సలాం మరణము నిరూపితమైనది. నిజమైన రీతిలో ప్రవక్త ప్రేమికులను ప్రవక్త అవమానితులుగా అపనిందకు గురిచేసే నీచ ప్రయత్నము బదులు మొదట తమ ఆత్మపరిశీలన చేసుకొని ప్రవక్త అవమానితులు మీరా మేమా? తెలుసుకోవాలని మేము ఈ విగ్రహపూరిత ముల్లాలకు చెప్పదలచితిమి. మీరు కేవలం హ॥జ్రత్ ఈసా అలైహిస్సలాంను బ్రతికించి చూపగలరు! (9వ పేజిలో చదువండి)

# జుమా ప్రసంగము

అహ్మదీయులు తమ ధనమును అల్లాహ్ తఆలా మార్గములో ఖర్చు చేస్తుంటారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం లక్ష్యమును నెరవేర్చాలని, మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జెండాను ప్రపంచములో ఎగురవేయాలని వారు భావిస్తుంటారు.

తహ్రీకే జదీద్ యొక్క 87వ ఆర్థిక సంవత్సరం విజయవంతము, శుభప్రదముగా ముగింపు, మరియు 88వ సంవత్సరపు ప్రారంభోత్సవ ప్రకటన.

అల్లాహ్ తఆలా కృపానుసారము తహ్రీకె జదీద్ ధన త్యాగములో 15.3 మలియన్ పౌండ్ల త్యాగము చేయుటకు అనుగ్రహము జమాఅత్‌కు లభించెను. ఇది గత సంవత్సరం కంటే 8 లక్షల 42 వేల పౌండ్లు అధికం.

ఈ త్యాగముల వలన వచ్చే నగదు ఇస్లాం ప్రచారము కొరకు ఖర్చు అవుతుంది. మన టీ.వి. చానల్ నడుస్తుంది. దానికి అంతులేని ఖర్చు అవుతుంది. పుస్తకములు ముద్రించబడుతున్నవి. పవిత్ర ఖుర్‌ఆన్ ప్రచురించబడుతుంది. బీద విద్యార్థుల విద్యకు ఖర్చు అగుతుంది. ఆకలితో వున్న వారికి భోజనము అందించుటకు ఖర్చు అవుతుంది. ముబల్లిఘీన్ల చదువుకు, వారి ద్వారా ప్రచారము కొరకు ఖర్చు అవుతుంది. మస్జిదులు నిర్మించబడుచున్నవి. ఇంకా ఇటువంటి అనేక ఖర్చులు జమాఅత్ చేస్తుంది.

అల్లాహ్ తఆలా కృపానుసారము అహ్మదీయులలోని ధనికులు కూడ త్యాగము చేయు ఉత్సాహము కలిగియున్నారు. వచ్చినటువంటి నగదును దాచుకోకుండా అల్లాహ్ తఆలా మార్గములో ఖర్చు చేయుటకు ప్రయత్నిస్తుంటారు.

ఇస్లాం ప్రచారము కొరకు మనలోని ప్రతి ఒక్కరికి త్గాయము చేయుటకు అల్లాహ్ తఆలా అనుగ్రహించుగాక! తమ పవిత్ర ఆదాయముతో త్యాగము చేయువారమగుదుము గాక! అల్లాహ్ తఆలా వద్ద ఈ త్యాగము ఆమోదించబడు గాక! అల్లాహ్ తఆలా మనతో రాజీ పడు గాక!

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 05 నవంబర్ 2021, ( 05 నభువ్వత్ 1400 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيْكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُوْلُهُ
أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ
اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ . اَلرَّحْمٰنِ الرَّحِيْمِ . مٰلِكِ يَوْمِ الدِّيْنِ .
اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ . اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ .
صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ .

అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్‌ఆన్‌లో విశ్వాసుల కొన్ని విశిష్టతలను వివరించాడు. వాటిలో ఒకటి ఏమనగా వారు తమ పవిత్ర ధనములో నుండి అల్లాహ్ తఆలా ప్రీతి కొరకు అల్లాహ్ తఆలా మార్గములో ఖర్చు చేస్తారు. ఒకచోట అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్‌ఆన్‌లో ధనము గురించి ప్రస్తావించినప్పుడు విశ్వాసులు మాత్రమే ఖర్చు చేస్తారని చేప్పాడు. మరొక చోట దానముల వైపు దృష్టి సారిచాలని సూచిస్తు దానములని ప్రస్తావించాడు. మరొక చోట జకాత్ (విధి దానము) గురించి అల్లాహ్ తఆలా ఖర్చును గుర్తు చేశాడు. త్యాగధనులు తమ ధనమును అల్లాహ్ తఆలా మార్గములో చెల్లించినప్పుడు ఆ ధనమును ఎక్కడెక్కడ ఎలా ఖర్చు చేయాలో, ఎక్కడ ఖర్చు చేయాలో కూడ చెప్పాడు. దైవ పక్షములు తమ ధనమును పవిత్రము చేయుటకు, అల్లాహ్ తఆలా శుభములను పొందుటకు, అల్లాహ్ తఆలా ప్రీతిని పొందుటకు అల్లాహ్ తఆలా మార్గములో ధనమును ఖర్చు చేస్తాయి.

జమాఅత్‌లో కూడ ఇదే విధంగా ధనమును త్యాగము చేయు పరంపర కొనసాగుతుంది. ఇది అల్లాహ్ తఆలా ఆదేశమని, వీరు సమర్పించు త్యాగములను ఎలా ఖర్చు చేస్తారనే విషయము జమాఅత్ సభ్యులకు కూడ తెలుసు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తీసుకొచ్చిన లక్ష్యము అనగా అల్లాహ్ తఆలా ఏకత్వమును ప్రపంచములో స్థాపించుట, ఇస్లాం, హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పతాకమును ప్రపంచములో ఎగురవేయుట అనేది ఏదో సాధారణ పని కాదు. చాలా విశాలమైన పని.టీ సందేశమును ప్రపంచములో వ్యాపింపజేయుటకు ఖర్చులు అవసరముంటాయి. తమ ధనమును అల్లాహ్ తఆలా మార్గములో ఖర్చు చేయుమనే అల్లాహ్ తఆలా ఆదేశమును అల్లాహ్ తఆలా కృపానుసారము జమాఅత్ సభ్యులు అర్థము చేసుకుంటారు, ఈ అవసరాలను పూర్తి చేయుటకు ప్రయత్నిస్తారు. ప్రపంచములోని వివిధ దేశములలో వ్యాపించి వున్న అహ్మదీయులు తమ ధనమును ఖర్చు చేయు ఎటువంటి ఉదాహరణలను చూపిస్తున్నారనగా వాటిని చూసి నిశ్చయముగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అల్లాహ్ తఆలా అవతార పురుషులని మనిషి గతము కంటే ఎక్కువగా నమ్మకం పొందుతాడు. వారి ద్వారనే ఈ చివరి కాలములో ఇస్లాం అందమైన బోధన వ్యాపించవలసి వున్నది. ఈ ఒక్క సంకేతమునే వ్యతిరేకులు శ్రద్ధతో చూసినచో, తమ హృదయముల నుండి కపటమును నిజాయితిగా తీసివేసినచో అహ్మదియ్యత్ సత్యమునకు ఈ ఒక్క సంకేతమే వారి మనసులో వున్న వ్యతిరేకతను తొలగించుటకు సరిపోవును. కాని హృదయములు ప్రత్యేకంగా నామమాత్రపు ఉలమాల హృదయములు రాళ్ళ కంటే ఎక్కువ కఠినంగా వున్నాయి. ఏదిఏమైనప్పటికి వారి విషయమును అల్లాహ్‌కే వదిలి పెట్టెదము.

నేను చెప్పినట్లు అహ్మదీయులు తమ ధనమును అల్లాహ్ తఆలా మార్గములో ఖర్చు చేస్తుంటారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం లక్ష్యమును నెరవేర్చాలని, మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జెండాను ప్రపంచములో ఎగురవేయాలని వారు భావిస్తుంటారు. మీరు అల్లాహ్ తఆలా మార్గములో ఖర్చు చేసిన దానిని అనేక రెట్లు పెంచి తిరిగి ఇస్తానని నిస్సందేహంగా అల్లాహ్ తఆలా వాగ్దానము చేశాడు. కాని మాకు అల్లాహ్ తఆలా ప్రసన్నత మాత్రమే ముఖ్యము, ప్రాపంచిక లబ్ది చేకూరినచో అది అల్లాహ్ తఆలా శుభమని భావించే అనేక అహ్మదీలున్నారు. త్యామగులో అల్లాహ్ తఆలా మాతో రాజీ పడాలని, మా పరలోక జీవితము చక్కబడుటకు తగు ఏర్పాట్లు చేసుకోవాలని వారు భావిస్తుంటారు.

అహ్మదియ్య జమాఅత్‌లో అరబ్‌పతులు లేరు. ఇందులో అధికంగా పేదలు లేదా మధ్య తరగతికి చెందిన వారే ఎక్కువ వున్నారు. కాని త్యాగము పట్ల ఒక ఉత్సాహము వున్నది. ఇస్లాం ద్వితయ ప్రచారములో మేము కూడ భాగస్వాములము కావాలని ప్రత్నిస్తుటారు. కావున వారి సాధారణ త్యాగములు సైతం అల్లాహ్ తఆలా వద్ద ఆమోదింపబడి లక్షలు, కోట్ల పౌండ్లకు సమానంగా ఫలితములను అందిస్తుంటాయి. కనుక అల్లాహ్ తఆలా ఆస్థానములో ఆమోదించబడుటయే ముఖ్యమైన విషయము. అల్లాహ్ తఆలా కృపానుసారము జమాఅత్ తమ పరిమిత వనరులతో ఏ పనిని మొదలు పెట్టినను అల్లాహ్ తఆలా అందులో శుభము కలిగించినందున చూపరకులు వీరు ఈ పనికి కొన్ని మిలియన్లు ఖర్చు చేస్తున్నారని

అనిపిస్తుంది. కాని ఇవి పేదల దబ్బులు, వీటిలో అల్లాహ్ తఆలా శుభము కలిగిస్తున్నాడని వారికి తెలియదు. దాని ఫలితంగా మన చిన్న పనులు సైతం పెద్ద పనులుగా కనిపిస్తాయి.

జమాఅత్ పెరిగిన కొద్ది వివిధ అభిప్రాయాలు కలిగిన వారు, తక్కువ శిక్షణ గలవారు లేదా పాత అహ్మదీయులలో శిక్షణ తక్కువ వున్నావారు లేదా ఇటువంటి ఆలోచన కలిగిన వారు ఇంట్లో తమ పిల్లల ముందు ఇటువంటి కొన్ని విషయములు మాట్లాడుకున్నందున పిల్లల మెదడ్లలో మనము చందా ఎందుకు, దేనికి ఇవ్వాలని ప్రశ్నలు తలెత్తుతుంటాయి. పదవిదారులు మొదట తమ ఆచరణ, ప్రవర్తనలతో ప్రజల అనుమానాలు, సందేహాలను దూరము చేయవలెను. ప్రజలకు నమ్మకం కలుగవలెను. తాము ఇస్తున్న చందాను సరియైన పనిలో ఖర్చు చేస్తున్నారని, నిర్ణీత లక్ష్యము కొరకు ఖర్చు చేస్తున్నారనే నమ్మకము కలుగవలెను. ధన త్యాగమునకు గల ప్రాధాన్యత ఏమిటో, ఇది అల్లాహ్ తఆలా దృష్టిలో ఎంత ముఖ్యమో వారికి మంచి తెలుపవలెను. ఈ ధన త్యాగము వలన అల్లాహ్ తఆలా ప్రీతి లభిస్తుందని, ఈ త్యాగముల వలన వచ్చే నగదు ఎక్కడెక్కడ ఖర్చు చేస్తున్నారో సూచించవలెను. ఇస్లాం ప్రచారము కొరకు ఖర్చు అవుతుంది. మన టీ.వి. చానల్ నడుస్తుంది. దానికి అంతులేని ఖర్చు అవుతుంది. పుస్తకములు ముద్రించబడుతున్నవి. పవిత్ర ఖుర్ఆన్ ప్రచురించబడుతుంది. బీద విద్యార్థుల విద్యకు ఖర్చు అగుతుంది. ఆకలితో వున్న వారికి భోజనము అందించుటకు ఖర్చు అవుతుంది. ముబల్లిఘీన్ల చదువుకు, వారి ద్వారా ప్రచారము కొరకు ఖర్చు అవుతుంది. మస్జిదులు నిర్మించబడుచున్నవి. ఇంకా ఇటువంటి అనేక ఖర్చులు జమాఅత్ చేస్తుంది. ప్రజలలో అధికంగా ప్రశ్నలు తలెత్తుతున్నాయనే కారణముతో నేను ఈ విషయములను తెలుపడం లేదు. జమాఅత్ వ్యాపిస్తున్న కొద్ది పీడనము సృష్టించువారు, షైతానీ అనుమానాలు పుట్టించేవారు కూడ ఎక్కువే వుంటారని వారు కుట్రలకు ప్రయత్నిస్తారని, తక్కువ శిక్షణ పొందిన మెదడ్లలో సందేహాలు కలిస్తారని నేనీ విషయములను తెలిపినాను. అల్లాహ్ తఆలా కృపానుసారము జమాఅత్ వ్యవస్థను కొనసాగించుటకు డబ్బులు అవసరమని జమాఅత్ సభ్యులకు తెలుసు. వారు చాలా పరిపక్వత కలిగి వున్నారు. తన మార్గములో ఖర్చు చేయాలనేది అల్లాహ్ తఆలా ఆదేశమని వారికి తెలుసు. తమ వద్ద ఏమియును లేకున్నను ఏదో ఒక రకంగా అల్లాహ్ తఆలా ప్రీతి కొరకు ఖర్చు చేయు భావన కలిగి వున్నవారు చాలా మంది జమాఅత్లో వున్నారు. ఇటువంటి అనేక ఉదాహరణలు గలవు. అనంతరం అల్లాహ్ తఆలా వారి ఈ త్యాగములను వృథా చేయడు. అల్లాహ్ తఆలా తన వాగ్దానము మేరకు అనగా వమఁయ్యర్జుఖ్హు మిన్ హైసు లా యహతసిబ్ అనగా ఎక్కడి నుండి ఆహారము లభించే ఊహ లేదో అక్కడి నుండి కూడ అల్లాహ్ తఆలా వారికి ఆహారము నొసంగుతాడు. అల్లాహ్ తఆలా సైతం ఇలా తన వాగ్దానమును పూర్తి చేస్తాడు. అహ్మదీయులు దీనిని పవిత్ర ఖుర్ఆన్లో చదవడమే కాక పూర్తి అగుతున్నట్లు కూడ చూస్తున్నారు. దీని గురించి తమ అనుభవాలను వ్రాస్తున్నారు. కావున ఇందుకు నేను కొన్ని సంఘటనలను కూడ ఉదాహరణగా తెలుపుతాను. ఇవి ఏవో పాత విషయములు కావు. మేము ప్రాచీన కథలను వినడం లేదు. నేడు కూడ అల్లాహ్ తఆలా ఇటువంటి అనుభవాలతో విశ్వాసుల విశ్వాసమును దృఢపరుస్తున్నాడు. అల్లాహ్ తఆలా కృపానుసారము కొందరు నేరుగా లబ్ది పొందుతున్నారు, మరికొందరు వారి సమీపులు సైతం ప్రయోజనము పొందుతున్నారు. వారి విశ్వాసులు కూడ బలపడుతున్నాయి. ఈ ధన త్యాగము కారణముచే వారికి భావము కలుగుతుంది. కావున వారు కూడ అల్లాహ్ తఆలా సామీప్యము పొందువారగుటకు తమ త్యాగములలో ముందడుగు వేయుటకు కృషి చేస్తారు. కొన్ని ఉదాహరణలను ప్రవేశపెట్టుతానని నేను చెప్పినట్లు అల్లాహ్ తఆలా ఏ విధంగా కరుణిస్తాడో ప్రజలు నాకు ఉత్తరాలలో తమ త్యాగముల గురించి రాస్తారు. వాటిని ఇప్పుడు నేను ప్రవేశపెట్టుతున్నాను.

గనీకరీకి చెందిన ఒక సంఘటన గలదు. ముబల్లిఘ్ ఇంచార్జి ఇట్లు వ్రాసిరి. నేను తహ్రీకె జదీద్ గురించి విశ్వాసభరిత సంఘటనలను వినిపించిన ఖుత్బా నుండి కొన్నిటిని జమాఅత్కు వినిపించి, ఇటువంటి ఉదాహరణలను మీరు కూడ చూపించాలని హితబోధ చేసిరి. అనంతరం మైమూనా ఖాతూన్ అనే మహిళ ఫోన్ చేసి ఇట్లు తెలిపిరి. ఇంటి ఖర్చుల కొరకు నా దగ్గర డబ్బులు లేవు. భర్త తన స్వంత పని మీద నగరము నుండి బయటికి వెళ్ళిరి. జుమా నమాజ్ తర్వాత వారి తండ్రి ఒక లక్ష గనీ ఫ్రాంక్ డబ్బులు వారికి కానుకగా అందించిరి. కావున ఈ డబ్బును నా గృహ అవసరాలకు వినియోగించుకోవాలా లేక చందాలో చెల్లించనా అనే సందిగ్దంలో నేనున్నాను. కాని దుఆ చేసి సగం డబ్బులు అనగా 50 వేల ఫ్రాంక్ రూ॥లను చందా తహ్రీకె జదీద్లో చెల్లించాను. సరియైన నిర్ణయము తీసుకొనుటకు అనుగ్రహించినందుకు నేను అల్లాహ్ తఆలాకు కృతజ్ఞతలు తెలిపినాను. ఇలా నా విశ్వాసము మరింత బలపడిందని కూడ ఆమె వివరించారు.

కెనడాలోని ఒక మజ్లిస్ సదర్ (అధ్యక్షురాలు) ఇట్లు తెలిపిరి. బకాయాదారుల మహిళల చందాను ఇతర మహిళలు విరాళాలు సమర్పించి పూర్తి చేయాలని తహ్రీకె జదీద్ కార్యదర్శి పిలుపు నిచ్చెను. మొత్తం ఎంత బకాయా వున్నదని తెలుసుకోగా అక్కడి ప్రకారము కొంచెం అనగా 325 డాలర్లు బకాయా వుండెను. కావున నేను స్వంతంగా చెల్లిస్తానని భావించితిని. కాని నేను నా ఖాతా చూడగా అందులో ఎలాంటి నగదు నిల్వ లేకుండెను. ఖాతా మైనస్ నడుస్తుండెను. మూడు డాలర్లు ఎక్కువగానే ఖర్చు అయ్యెను. అనంతరం మరుసటి నేను మరల ఖాతా పరిశీలిచంగా మూడు వేల కంటే ఎక్కువ డబ్బులు నిల్వ వుండెను. వారింకా ఇట్లు తెలిపిరి. న డబ్బులు చాలా కాలము నుండి నాకు రావలసి వుండెను. ఇవి లభిస్తాయనే నమ్మకము కూడ నాకు లేకుండెను. నేను బాకాయా చెల్లిస్తాననే నా సంకల్పమును అల్లాహ్ తఆలా చూసి తను కరుణించి ఈ బకాయాను చెల్లించుటకు తగిన ఏర్పాట్లు చేసెను. చాలా కాలము నుండి ఆగి పోయిన డబ్బులను నాకు లభించేటట్లు చేసెను.

ఇంకా సౌత్ ఆఫ్రికాలోని ఒక మిత్రులు షాహీన్ గారు ఇట్లు వ్రాసిరి. నేను తహ్రీకె జదీద్ చందాలను చెల్లించినాను. నా బ్యాంక్ ఖాతాలో వున్న సగం డబ్బులను నేను ఈ చందాకు చెల్లించాను. ఇంకా ఇట్లు తెలిపిరి. ఇదేదో భారీ నగదు కాదు. కాని తహ్రీకె జదీద్ చివరి నెల అయినందున తర్వాత చందా చెల్లించే అవకాశము లభిస్తుందో లభించదో అని భావించి నేను ఈ డబ్బులను చెల్లించి వుంటిని. చెల్లించిన రోజే వారి తండ్రి గారు వారిని చూడడానికి వచ్చిరి. నేను కొంత డబ్బును ఖాతా నుండి నీకు పంపించాను. అది నీకు లభించినచో అవసరాలు తీరునని నా తండ్రి గారు నాకు చెప్పిరి. చందా తహ్రీకె జదీద్లో చెల్లించిన నగదు కంటే తండ్రి ఇచ్చిన నగదు 20 రెట్లు అధికంగా వుండెను. వారింకా ఇట్లు తెలిపిరి. నా ఆదాయము పెరిగినందున, ఎలాంటి ఆశ లేని దగ్గర నుండి నాకు అల్లాహ్ తఆలా మరింత డబ్బు అందించినందున నేను మరల చందా చెల్లించితిని. కావున అదే రోజు సాయంత్ర వారు పని చేస్తున్న వద్ద నుండి యజమానురాలు ఫోన్ నువ్వు కోరుకున్నచో చేసి మేము ఒక ఉద్యోగము దుబయ్లో ఇవ్వాలనుకుంటున్నామని అనిరి.ఇలా వారు సరే అని చెప్పడంతో విదేశాలలో వారికి ఒక మంచి ఉద్యోగము సైతం లభించెను. కావున వారిట్లు తెలిపిరి. ఈ రెండు సంఘటనలు కేవలం అనుకోకుండా జరిగినవి కాదు. మంచదా ఇవ్వడం వల్లనే, త్యాగము చేసినందుకే అల్లాహ్ తఆలా కరుణించెనని నాకు నమ్మకమున్నది.

ఇంకా ఆస్ట్రేలియా నుండి ఒక మిత్రులు ఇట్లు వ్రాసిరి. మురబ్బి గారిట్లు తెలిపిరి. జమాఅత్లోని ఒక సభ్యులు నాకిట్లు తెలిపిరి. వారు చందా చెల్లించుటకు వాగ్దానము చేసిరి. కాని ఆర్థిక పరిస్థితులు మంచిగా లేకుండెను. వాగ్దానము మేరకు చందా చెల్లించి అల్లాహ్ తఆలా నాకు వంద రెట్లు అధికంగా అందించునని మనసులో నమ్మకము పెట్టుకొనిరి. అల్లాహ్ తఆలా వాగ్దానమని కూడ కొందరు భావిస్తుంటారు. వారు ఒక ప్లాటు కొని వుంటిరి. దాని విలువ పెరిగే ఎలాంటి అవకాశము లేకుండెను. కాని చందా చెల్లించిన తర్వాత మహిమాన్వితంగా ఆ ప్లాటు లాభము వందల రెట్ల కంటే ఎక్కువే పెరిగెను. కనుక ఈ ఆర్థిక త్యాగమును ఆమోదించినందు వలన ఈ విధంగా కరుణించెనని నాకు గట్టి నమ్మకము కలిగినదని వారు తెలిపిరి.

ఇలాగే ఖజాకిస్తాన్ ముబల్లిఘ్ గారిట్లు వ్రాసిరి. అక్కడి లోకల్ వినమ్రులైన ఒక అహ్మదీ అలీ బేక్ గారున్నారు. అక్కడి కరెన్సీ (ద్రవ్యం) ప్రకారము పది వేల తంగే రూ॥లను తహ్రీకె జదీద్లో మొ॥ వాటిలో చెల్లించిరి. అనంతరం పని కొరకు వెళ్లిరి. కొన్ని రోజుల తర్వాత కంపెనీ ఉన్నతాధి కారులు నన్ను పిలిచి నాతో ఇట్లనిరి. మా కంపెనీకి ఈ సారి చాలా లాభము వచ్చినది. కావున మంచిగా పని చేసినందుకు ముగ్గురికి ఒక లక్ష రూ॥ల బోనస్ ఇవ్వాలని మేము నిర్ణయించాము. వారిట్లు తెలిపిరి. అల్లాహ్ తఆలా ఈ చందా వలన పది రెట్లు పెంచి నాకందించెను. వాస్తవానికి నాకు ఇలాంటి ఆశ ఏమాత్రం లేకుండెను.

ఇంకా బర్మింగమ్ యు.కె. నుండి ఒకరిట్లు తెలిపిరి. నేను నా కుటుంబ

సభ్యులతో కలిసి 2016 సం॥లో బైఅత్ చేసి వుంటిని. బైఅత్ కంటే ముందు ఆర్థిక పరిస్థితులు చాలా దీనంగా వుండెను. అప్పులు కూడ చాలా వుండెను. జమాఅత్‌లో చేరిన తర్వాత నా స్థోమత ప్రకారము చందాలు చెల్లిండం మొదలు పెట్టాను. కొన్ని సార్లు నా స్థోమతను మించి కొన్ని ఉద్యమాలలో పాల్గొనడం మొదలు పెట్టాను. ఆరంభ రోజుల విషయమిది. పాఠశాల కార్యక్రమములో నా భార్య ఒక ప్రచార శిబిరం ఏర్పాటు చేయవలసి వుండెను. పిల్లలను చూసుకోవడానికి నేను పనికి వెళ్లకుండా సెలవు తీసుకొంటిని. ఈ సెలవు వలన 100 పౌండ్ల నష్టము వాటిల్లేది. అప్పుడు ఆర్థిక పరిస్థితు మంచిగా లేనందున ఈ డబ్బులు మాకు చాలా ఎక్కువ అనిపించెను. కావున నేను బాగా ఆలోచించి అల్లాహ్ తఆలా పని కొరకు సెలవు తీసుకోవాలని, త్యాగము ఇవ్వవలెనని నేను సెలవు తీసుకొన్నాను. కాని అల్లాహ్ తఆలా మరో విధంగా ఆలోచించెను. నా భార్య తన పని ముగించుకొని ఇంటికి చేరుకొనెను. అప్పుడే నా యజమాని ఫోన్ చేసి చాలా ఆకస్మికత పని పడినందున వీలైనచో ఒక గంట కొరకు పనికి చేరుకో అని చెప్పెను. వారిట్లు తెలిపిరి. కావున నేను తక్షణమే బయలు దేరి ఆ రోజు ఒక గంట మాత్రమే పని చేసి మొత్తం 100 పౌండ్లు పొందితిని. ఇంటికి చేరుకొని నేను భార్యకు ఈ విషయం తెలిపితిని. క్రొత్త క్రొత్తగా అహ్మదీయులై వుంటిమి. అల్లాహ్ తఆలా తరపున బహుమానము చాలా రోజుల వరకు మేము ఆనందపడుతు అల్లాహ్ తఆలా కృతజ్ఞతలు తెలిపితిమి.

వకీలుల్ మాల్ తహ్‌రీకె జదీద్ ఖాదియాన్ ఇట్లు వ్రాసిరి. ఇండియాలోని అహ్మదియ్యాహ్ జమాఅత్ కరులాయికి చెందిన ఒక మిత్రులు మంచి ధనవంతులు, మంచి వ్యాపారస్తులు. తహ్‌రీకె జదీద్‌లో చాలా ఉత్సాహముతో ప్రతి సంవత్సరం భారీ నగదు చెల్లిస్తుంటారు. ఈ సంవత్సరం కరోనా వలన భారీ నగదు చెల్లించేందుకు అవకాశము లేకుండెను. చందా వసియ్యత్‌తో పాటు ఇతర చందాలు చెల్లించిరి. కాని తహ్‌రీకె జదీద్ చందా చెల్లించుటకు నగదు లేకుండెను. ప్రతి సారి అల్లాహ్ తఆలాయే చందా చెల్లించుటకు అనుగ్రహిస్తాడు, ఈ సారి కూడ అల్లాహ్ తఆలాయే తప్పక ఏదో ఒక రకంగా ఏర్పాట్లు చేసినచో చెల్లిస్తానని అల్లాహ్ తఆలాపై నమ్మకము పెట్టుకొనిరి. ఇంకా ఇట్లు తెలిపిరి. చివరి రెండు రోజులకు ముందు వారు పది లక్షల రూపాయలు తహ్‌రీకె జదీద్‌లో చెల్లించిరి. ఇట్లు తెలిపిరి. శుక్రవారము రోజులన మురబ్బి గారు ఖుత్బాలో తహ్‌రీకె జదీద్ గురించి మరల సభ్యులకు సూచించారు. నా ఖుత్బాల నుండి కొన్ని సంఘటనలు సైతం వినిపించారు. నేను చాలా ప్రభావితమైనాను. కావున పది లక్షల బదులు సుమారు 18 లక్షల చందా చెల్లించాను. తర్వాత ఒక ప్రభుత్వ ప్రాజెక్టు (పథకం) వారికి లభిస్తుందని వారు నమ్ముతున్నారు. అది నాకు లభించినచో తహ్‌రీకె జదీద్‌లో ఇంకా పెద్ద నగదు చెల్లిస్తానని వారు తెలిపిరి. అల్లాహ్ తఆలా కృపానుసారము అహ్మదీయులలోని ధనికులు కూడ త్యాగము చేయు ఉత్సాహము కలిగియున్నారు. వచ్చినటువంటి నగదును దాచుకోకుండా అల్లాహ్ తఆలా మార్గములో ఖర్చు చేయుటకు ప్రయత్నిస్తుంటారు.

బుర్కినా ఫాసు ముబల్లిఘ్ హబీబ్ గారిట్లు వ్రాసిరి. సూరో సయీద్ గారని ఒక సభ్యులు అక్కడున్నారు. 1700 రూ॥ ఫ్రాంక్ సీఫా వారి బకాయా వుండెను. సంవత్సరం ముగింపునకు ఒక వారము మాత్రమే మిగిలి యుండెను. కావున వారు కష్టపడి రెండు వేల సీఫా ఫ్రాంక్ చెల్లించిరి. అది వారి బకాయా కంటే ఎక్కువే వుండెను. వారిట్లు తెలిపిరి. నేను చందా చెల్లించి ఒక గంట కూడ గడవలేదు. తెలిసిన ఒకరు సది వేల ఫ్రాంక్ సీఫా నాకు పంపించిరి. మరికొంత సమయము తర్వాత మరో పది వేల సీఫా ఫ్రాంక్ పంపించి ఇట్లు ఫోన్ చేసిరి. మొత్తం ఇవరై వేల సీఫా ఫ్రాంక్ రూ॥లు నేను నీకు కానుకగా పంపించాను. సయీదూ గారిట్లు తెలిపిరి. ఆ పరిచయస్తుడు నాకు ఇంతకు ముందు ఎప్పుడు పైసలివ్వలేదు. మొదటి సారి ఇలా జరిగెను. నేను రెండు వేల రూ॥లు చందాలో చెల్లించగానే రెండు గంటల లోపు అల్లాహ్ తఆలా నాకు 20 వేల రూ॥ అందించెను. ఈ విధంగా ప్రజల విశ్వాసము కూడ పెరుగుతుంది.

సీరాలియోన్‌లో లంగీ అనే రీజన్ ఒకటుంది. అక్కడి ముఅల్లిమ్ అబ్దుల్లాహ్ గారిట్లు తెలిపిరి. వయోజనులైన ఒక సభ్యులు పాజీంగ్ కాయిన్ గారున్నారు. గత సంవత్సరం వారి చందా తహ్‌రీకె జదీద్ వాగ్దానము 25 వేలు లీవెన్ రూ॥ వుండెను. ఈ సంవత్సరం వారు 50 వేల లీవెన్ రూ॥ల చందా వాగ్దానము వ్రాయించిరి. అప్పుడు వారు ఆర్థికంగా కష్టములను కూడ ఎదుర్కొంటుండిరి. తహ్‌రీకె జదీద్ చందా వసూలు చేస్తున్నప్పుడు ప్రకటన చేయబడగా నా చందా ఎంత వున్నదని వారు లోకల్ మిష్నరీని అడిగిరి. 50 వేల లీవెన్ రూ॥లని వారికి చెప్పగా తాను ఎలా ఇంత చందా వ్రాయిచ్చారోనని ఆశ్చర్యమునకు గురైరి. నేను ఇంత చెల్లించలేను. మీరు స్వయంగా ఇంతా వ్రాశారని వారనిరి. అనంతరం మౌనము పాటించిరి. వచ్చే వారము అన్సార్ సమావేశము జరిగెను. అందులో వచ్చి ఇట్లు చెప్పిరి. నా దగ్గర 60 వేల లీవెన్ రూ॥లుండెను. వాటిలోని 20 వేల లీవెన్ లను నేను ఇంటి ఖర్చులకు పెట్టి 40 వేల లీవెన్ రూ॥లను తహ్‌రీకె జదీద్‌లో చెల్లించటానికి తీసుకొచ్చాను. ఇప్పుడు నా దగ్గర తిరిగి పోవుటకు కూడ కిరాయ లేదు. మీరు త్యాగము చేశారు, అల్లాహ్ తఆలా ఏదో రకంగా ఏర్పాటు చేయునని నేను వారికి చెప్పాను. ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండిరి. మార్గమధ్యలో ఒక చాలా ప్రాచీన పరిచయస్తుడు కలిసెను. చాలా కాలము తర్వాత అతను కలిసెను. మిత్రులు కలిసి మాట్లాడుకుంటూ వెళ్ళిరి. ఆ మిత్రుడు పోతూ పోతూ 30 వేల లీవెన్ రూ॥లు ఆ వయోజనుకికి కానుకగా ఇచ్చెను. అనంతరం మరో తెలిసిన మహిళ ఆరోగ్యము గురించి తెలుసుకొనుటకు, పరామర్శించుటకు ఆమె ఇంటికి చేరుకుంటిని. లేచి వెళ్తుండగా ఆమె 10 వేల లీవెన్ ఇస్తు వీటిని కిరాకు వియిగోంచుకోమని నాకిచ్చెను. ఇలా తాను చందాలో చెల్లించిన రూపాలను అల్లాహ్ తఆలా తిరిగి ఇప్పించెనని వారు తెలిపిరి. దానితో వారు తమ వాగ్దానమును పూర్తిగా అనగా 50 వేల లీవెన్లు చెల్లించిరి.ఇంతే కాక మరో అనుగ్రహము కూడ కలిగెను. ఒక బంధువు విదేశాలలో నివాసముండెను. అతడు ఫోన్ చేసి ఇట్లనెను. చాలా కాలము నుండి మీతో మాట్లాడలేక పోయాను. నేను మీకు కానుకగా 4 లక్షల లీవెన్లు పంపిస్తున్నాను. సమానంగా మాత్రమే డబ్బులు తిరిగి ఇవ్వక పది రెట్లు పెంచి అల్లాహ్ తఆలా అనుగ్రహించెను. ఇలా త్యాగము చేయుటకు కూడ నాకు అనుగ్రహము లభించెను. నా విశ్వాసము కూడ పెరిగెను.

ఇలాగే గనీకరి రీజన్ బోకేలోని ఒక గ్రామ మిష్నరీ ఇట్లు తెలిపిరి. తహ్‌రీకె జదీద్ చందా వసూలు చుయుటకు తహ్‌రీకె జదీద్ వారోత్సవము జరిపెను. ఖుత్బా జుమాలో సూచించడమే కాక వ్యక్తిగతంగా ఇంటింటికి తిరిగి కూడ చెప్పిరి. ఒక వినమ్రులైన మిత్రులు జిబ్రీల్ గారు వృత్తిపరంగా వడ్రంగి పని చేసేవారు. వారింటికి వెళ్ళి వారికి చందా గురించి శ్రద్ధ కలిగించిరి. వారిట్లు తెలిపిరి. నేను నేటి ఖర్చుల కొరకు 20 వేల ఫ్రాంక్ పెట్టుకొంటిని. వాటన్నిటిని నేను చందాలో చెల్లిస్తాను. అవి తప్ప మా దగ్గర ఏమి లేవు. కాని అల్లాహ్ తఆలా మా త్యాగమును ఆమోదించాలని దుఆ చేస్తున్నాము. అనంతరం జిబ్రీల్ గారిట్లు తెలిపిరి. గత మూడు నెలల క్రితం నేను ఒక బెడ్ విక్రయించడానికి సిద్ధము చేసి వుంటిని. దానిని కొనుటకు ఎవరు రావడం లేదు. చందా చెల్లించిన తర్వాత ఒక వ్యక్తి బెడ్ కొనుటకు వచ్చెను. అతడు ఒక మిలియన్ ఐదు లక్షల ఫ్రాంక్ చెల్లించి దానిని కొనుగోలు చేసెను. జిబ్రీల్ గారు వెంటనే మన మిష్నరీకి ఫోన్ చేసి ఇట్లు తెలిపిరి. అల్లాహ్ తఆలా మన త్యాగమును ఆమోదించడమే కాకుండా అనేక రెట్లు పెంచి మాకు తిరిగి ఇచ్చెను. ఈ విషయమును వారు తమ మిత్రులకు కూడ చెప్తుంటారు. తద్వారా వారి విశ్వాసము కూడ పెరుగుతుంది.

మునీర్ హుసేన్ ముబల్లిఘ్ ఫ్రీ టౌన్ సీరాలియోన్ ఇట్లు తెలిపిరి. సాఫీ సోంగో అని ఒక యువకులు ఇంకా చదువుకుంటున్నారు. విద్యార్థిగా చదువుకొనుటకు మస్జిద్‌లో నివాసముంటున్నారు. వారు నా ఖుత్బా విన్నారు. రికార్డింగ్ విని వుండవచ్చు లేదా గత సంవత్సరం ఖుత్బా విని వుండవచ్చును. తహ్‌రీకె జదీద్ ఖుత్బాలో నేను ధన త్యాగధనుల సంఘటనలను వివరించివుంటిని. వారిట్లు తెలిపిరి. నేను చాలా శ్రద్ధతో మొత్తం ఖుత్బా విన్నాను. నేను కూడ ధన త్యాగము చేయగలిగితే బాటుండునని నాకు కూడ ఉత్సాహము కలిగెను. కాని కష్టమేమనగా నేను విద్యార్థిని ఎలాంటి పని కూడ చేయను. చదువుకు అయ్యే ఖర్చులు కూడ చాలా కష్టంగా పూర్తి అవుతుంటాయి. ఈ కష్టములన్ని వున్నను నాలో చాలా ఆందోళన కలుగుతుండెను. నేను తహ్‌రీకె జదీద్ కార్యదర్శికి ఐదు లక్షల చందగా నా చందా వ్రాయించాను. కాని ఇది నాకు చాలా కష్టంగానే వుండెను. అనంతరం వాటిని చెల్లించుటకు నేను చాలా కలత చెందితిని, అల్లాహ్ తఆలా ఏదో ఒక రకంగా ఏర్పాట్లు చేస్తే నేను చందా చెల్లించాలని రాత్రింబవళ్లు దుఆలు కూడ చేయడం మొదలు పెట్టితిని. ఇదిలా వుండగా కొన్ని రోజుల నా బంధువు ఒకరు తన కుమారుణ్ణి తీసుకొని వచ్చెను. అతణ్ణి అహ్మదియ్యాహ్ పాఠశాలలో చేర్పించవలసి వుండెను. నేను పాఠశాల

ప్రిన్సిపాల్‌తో మాట్లాడగా వారు అతనికి ప్రవేశము కల్పించిరి. ఆ బాలుని తండ్రి నాకు ఒక లక్ష రూపాయలిచ్చి వీటిని పెట్టుకో నీకు తినుటకు పని వస్తాయని చెప్పెను. ఆ రోజు నా దగ్గర తినడానికి కూడ ఏమియును లేకుండెను. కాని వాగ్దానములోని కొంతైనా తీరిపోవాలని నేను ఆ డబ్బులను మొత్తం చందా తహ్రీకె జదీద్‌లో చెల్లించాను. మరల కొన్ని రోజుల తర్వాత గుర్తు తెలియని నంబరు నుండి నాకు ఒక ఫోన్ వచ్చెను. ఒక పని చేసినచో మంచి పరిహారము చెల్లిస్తాము, నువ్వు సిద్ధమేనా అని అడిగిరి. నేను వెంటనే అవునని తెలిపితిని. అల్లాహ్ తఆలా కృపానుసారము ఆ పనికి బదులు నాకు ఒక మిలియన్ లీవెన్ లభించెను. తద్వారా నేను నా వాగ్దానము ప్రకారము చందా తహ్రీకె జదీద్ వెంటనే చెల్లించాను.

గేబూన్ ముబల్లిఘ్ ఇంచార్జి గారిట్లు వ్రాసిరి. ఈసా దీందా గారు క్రొత్తగా బైఅత్ చేశారు. బైఅత్ కంటే ముందు చందా చెల్లించనప్పుడు నా పరిస్థితి ఎట్లుండెననగా కొన్ని కొన్ని సార్లు రెండు లేదా మూడు వారాలు నాకు పని లభించేది కాదు. కాని నేను క్రమం తప్పకుండా చందా చెల్లిస్తున్నప్పటి నుండి ఇప్పటి వరకు నాకు ప్రతి రోజు పని లభిస్తుంది. వీరు చాలా దూరము నుండి వచ్చి క్రమం తప్పకుండా చందా చెల్లిస్తారు. ఎంత చందా చెల్లిస్తారో అంతే ట్యాక్స్ కిరాయ కూడ చెల్లిస్తారు. ఇలా వారు రెట్టింపు ఖర్చు చేయవలసిన అవసరం లేకుండా ఇప్పుడు తమ ఇంటి నుండే చందా చెల్లించుటకు వారికి ఏర్పాట్లు చేయనైనది.

ఉర్దన్ నుండి మహిళ ఫజ్ర్ గారిట్లు తెలిపిరి. అహ్మదియ్యత్‌లో ప్రవేశించి నాకు 22 సం॥లు గడుస్తున్నవి. నేను అహ్మదీ అయినప్పటి నుండి గమనిస్తున్నాను. ఎప్పుడు చందా ఇవ్వాలని నేను సంకల్పించుకున్నను అల్లాహ్ తఆలా పరోక్షంగా సహకరించి డబ్బులను ఏర్పాటు చేస్తాడు. కొన్ని చందా ఇవ్వాలని సంకల్పించినన్ని డబ్బులు మాత్రమే అందుతాయి. ఇది జమాఅత్ శుభమే. ఇంకా ఇట్లు తెలిపిరి. నేను ఇంజనీరింగ్ చదివినాను. ఇంటి వద్ద వుంటూనే ఏదైనా పని దొరికినచో చేస్తుంటాను. నేను చందా కొరకు నా భర్తతో డబ్బులు తీసుకోను. ఇది నా అలవాటు. ఎందుకనగా పదే పదే వారు ఆర్థికంగా ఇబ్బంది పడుతుంటారు. నేను నా స్వంత ఆదాయముతో చందా చెల్లిస్తాను. ఈ సంవత్సరం చందా తహ్రీకె జదీద్ చెల్లించానని నేను భావించితిని. కాని వాస్తవానికి నేను మరచిపోయి వుంటిని. నాకు గుర్తు చేయించబడినప్పుడు నా దగ్గర ఒక్క దీనార్ కూడ లేకుండెను. చందా ఎలా చెల్లించాలని నేను చింతిస్తుంటిని. కాని ఒక విద్యార్థిని నా వద్దకు వచ్చి నాకు ట్యూషన్ చెప్పడని అనెను. అల్లాహ్ తఆలా కృపానుసారము ట్యూషన్ ఫీస్‌తో చందా పూర్తిగా చెల్లించగలను, ఇంకా కొంత మిగులు కూడ.

బుర్కీనాఫాసులో బోకూబగాలా ఒక జమాఅత్ వున్నది. అక్కడి సదర్ జమాఅత్ ఇట్లు తెలిపిరి. నా వద్దకు కొందరు జమాఅతేతర సభ్యులు వచ్చి ఇట్లనిరి. మేము మీ పంటలను చూసి ఆశ్చర్యానికి గురైనాము. ఎందుకనగా మేము మీరు జమాఅత్ పాఠశాల నిర్మాణములో అధిక సమయము కేటాయించినట్లు చూసినాము. మీరు లేనప్పుడు మీ పంటలను పర్యవేక్షించేవారెవరు లేకుండిరి. అయినను మీ పంటలు మా పంటల కంటే చాలా బాగున్నాయి. ఇందుకు భిన్నంగా మేము మా సమయము మొత్తం మా పంటల కొరకు కేటాయించాము. అయినను మీ పంటల వలె మా పంటలు అంత మంచిగా లేవు. దీనికి బదులుగా వారికి సదర్ గారిట్లు తెలిపిరి. మేమందరము ఈ శ్రమదానము అల్లాహ్ తఆలా, జమాఅత్ కొరకు చేశాము. మేము ఎంత సమయము పాఠశాల కొరకు ఇచ్చేవారమో అంత సమయము ఇట్లు దుఆ చేసేవారము. అల్లాహ్ తఆలా నువ్వే మా పంటలను రక్షించుము. ఇప్పుడు మేము దాని ప్రకారము చందా కూడ చెల్లించినాము.

పిల్లలు కూడ ఎలాంటి త్యాగస్ఫూర్తి కలిగి వున్నారో చూడండి. వెనుకబడిన దేశాలకు చెందిన ఈ నిరుపేద పిల్లలకు వున్నంత ఆలోచన కొన్ని చోట్ల ధనిక దేశాల చదువుకున్న పిల్లలకు లేదు. ఈ సంఘటన వివరాలు ఇలా వున్నాయి. జన్‌బార్ ప్రాంత ముబల్లిఘ్ యూసుఫ్ హుసేన్ గారిట్లు వ్రాశారు. పిల్లలు మస్జిద్ బయట ఆడుకొంటుండగా అక్కడి నుండి ఒక పెద్ద మనిషి వెళ్ళిరి. వారు ఆనందించి టాఫీలు కొనుగోలు చేసుకోవడానికి 14 వందల షిలింగ్ పిల్లలకు ఇచ్చారు. పిల్లలు డబ్బులు తీసుకొని అహ్మదీ దుకాణాదారుని వద్దకు వెళ్ళిరి. అతనితో ఈ డబ్బుల బదులు నాణేలు తీసుకున్నారు. చిల్లరు చేయించుకున్నారు. పిల్లలందరు నాణేలను తీసుకొని మస్జిద్ వచ్చి తమ తమ భాగములో వచ్చిన నాణేలతో టాఫీలు కొనుగోలు చేసుకునే బదులు ఒక్కొక్క వంద షిలింగ్ రూ॥ చందాలో చెల్లించిరి. అనంతరం ఎంతో సంతోషముతో తమ తమ రసీదు తమ వద్ద పెట్టుకొనిరి. పిల్లలు చందా చెల్లించడానికి నాణేలను తీసుకున్నారని తెలిసినప్పుడు అహ్మదీ దుకాణాదారుడు సైతం ఆశ్చర్యానికి లోనయ్యెను. ఈ పిల్లలే అహ్మదియ్యహ్ జమాఅత్ పటిష్టతకు పాలుపడుదురు. ఇన్‌షాఅల్లాహ్.

పిల్లల త్యాగము గురించి మరో ఆశ్చర్యకరమైన దృశ్యము గలదు. ఇది తన్జానియా సంభవించిన సంఘటన. సమూయె ముఅల్లిమ్ గారిట్లు వ్రాసిరి. జమాఅత్‌లో నాలుగవ తరగతిలో చదువుతున్న ముగ్గురు పిల్లలున్నారు. క్రమం తప్పకుండా విద్య, శిక్షణ తరగతులకు మస్జిద్‌కు వస్తుంటారు. ముగ్గురు పిల్లల కుటుంబములు బీద కుటుంబములే. శాశ్వత ఆదాయ మార్గములు ఏమి లేవు. గత నెల నుండి వీరు చందా తహ్రీకె జదీద్ చెల్లించుటలో వీరు పరస్పరం పోటి పడుతుండిరి. ప్రతి ఒక్కరు విడి విడిగా వచ్చి తన దగ్గర వున్న డబ్బు మొత్తంను చందాలో చెల్లించుటకు ప్రయత్నించేవారు. ఒకరు ఐదు వందల షిలింగ్, ఒకరు నాలుగు వందల షిలింగ్ మరొకరు ఏడు వందల షిలింగ్ రూపాయలు తమ తమ స్థోమత ప్రకారము చెల్లించిరి. ఈ చందా తహ్రీకె జదీద్ కొరకు మీరు డబ్బులు ఎక్కడి నుండి తెస్తున్నారని ఒకసారి నేను వారిని అడిగినాను. ఒకరిట్లు సమాధానమిచ్చెను. నేను నా తల్లికి అడవిలో కట్టెలు కొట్టుటలో సహకరిస్తాను. తద్వారా నాకు లభించే జేబు ఖర్చు డబ్బులను నేను చందా తహ్రీకె జదీద్ కొరకు పెట్టుకుంటాను. నేను చందా చెల్లించడం మొదలు పెట్టినప్పటి నుండి కట్టెలు కొనుటకు గిరాకి వెంటనే వస్తున్నారు. ఎన్నడు నష్టము వాటిల్లలేదు. నేను చందా కొరకు తన జేబ్ ఖర్చు డబ్బులను విడిగా ప్రోగు చేసుకుంటున్నాని రెండవ బాలుడు చెప్పెను. మూడవ బాలుడు ఇట్లు తెలిపెను. నా ఇంటికి సమీపములోనే పండ్ల చెట్లు వున్నాయి. కొన్ని సార్లు నేను తిన్న తర్వాత మిగిలిన పండ్లను విక్రయిస్తాను. తద్వారా లభించే నగదుతో నేను చందా చెల్లిస్తాను. ఈ ముగ్గురు పిల్లలు చందా చెల్లించడంతో జీవితములో ఎలాంటి సంతోషము లభిస్తుందో తెలుపుతు చందాల శుభమును కూడ ప్రస్తావించారు. అల్లాహ్ తఆలా ఈ పిల్లల విశ్వాసము, వినయమును పెంచుగాక! ఇది విశ్వాసము, దీనితో మన పిల్లలు సైతం ఆనందపడుతుంటారు.

ముబల్లిఘ్ ఇంచార్జి బీలీజ్ ఇట్లు వ్రాసిరి. మొత్తం భిన్నమైన ప్రపంచ మరో కోణము నుండి బాలుని మరొక ఉదాహరణ ఇట్లు గలదు. ఒకటి ఒక కోణము కాగా మరొకటి మరో కోణము. కాని ఆలోచనలు మాత్రము ఒకే విధంగా వున్నాయి. బీలీజ్‌లో మస్జిద్ నిర్మాణము జరుగుతుండగా ఒక బాఉలుడ తాను ప్రోగు చేసుకున్న నగదు మొత్తం మస్జిద్ కొరకు సమర్పించెను. అతడు తహ్రీకె జదీద్‌లో కూడ ఆదర్శవంతమైన గొప్ప త్యాగము చేసెను. బాలుడు చాలా బీద కుటుంబానికి చెందిన వాడు. అతని తండ్రి ఎంతో కష్టంగా ఇంటి అవసరాలను పూర్తి చేస్తుంటాడు. మురబ్బి తహ్రీకె జదీద్ ప్రాముఖ్యత చెపిప్పుడు ఆ బాలుడు ఒక డాలర్ త్యాగము చేసెను. ఇది అతనికి చాలా పెద్ద విషయమే. కాని దానియాల్ అయిన ఆ బాలుడు ఇట్లనెను. ఇందులో నా పేరు వ్రాయకండి. ఎందుకనగా నేను ఈ డబ్బులను నా కుటుంబము తరపున సమర్పించాను. నేను నా భాగము తర్వాత ఇస్తాను. కావున ఆ బాలుడు మరుసటి ఇంకా పది డాలర్లు సమర్పించి ఇట్లు తెలిపెను. నా కుటుంబమును అల్లాహ్ తఆలా తప్పక కరుణిస్తాడనే నమ్మకము నాకుంది. ఇలా అతడు తన తరపున కూడ చందా చెల్లించెను.

క్రొత్తగా చేరేవారి హృదయాలలో అల్లాహ్ తఆలా ఏ విధంగా త్యాగస్ఫూర్తి కలిగిస్తాడో, ఎలా వారిని కరుణిస్తాడో చూడండి. దీని గురించి మరాకిష్ నూరుద్దీన్ గారిట్లు తెలిపిరి. 2017వ సం॥లో బైఅత్ తర్వాత నగదు త్యాగము చేయుటలో భాగము పాల్పంచుకొనడం మొదలు పెట్టితిని. అప్పుడు నా ఆదాయం చాలా తక్కువ వుండెను. ఒక రోజు జమాఅత్ వెబ్‌సైట్‌లో నేను ఖుత్బా విన్నాను. వారిట్లు తెలిపిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనుచరులు, ఇతర అహ్మదీయులకు నేను ఆర్థిక త్యాగము గురించి వివరిస్తుంటిని. వారిట్లు తెలిపిరి. కొన్ని రోజుల తర్వాత దీని వలన నా హృదయములో ఒక ఉత్సాహము కలిగినది. కొన్ని రోజుల తర్వాత సదర్ జమాఅత్ మరాకిష్‌తో నేను వసియ్యత్ వ్యవస్థలో చేరాలని భావిస్తున్నట్లు చెప్పితిని. అనంతరం కొన్ని రోజులకు నా పిరిస్థితులు మెరుగు పడినవి. నాకు ఒక కంపెనీలో మంచి ఉద్యోగము లభించినది. ఇదే కంపెనీ తరపున నేను మరొక నగరములో మేనేజర్‌గా పని చేస్తున్నాను. నా ఎద్యోగము కేవలం మూడు సంవతంసరములలో మూడు రెట్లు పెరిగినది. కంపెనీకి నాపై ఎంత నమ్మకము

పెరిగినదనగా నేను మరాకిష్ రాజధాని నుండి ఇతర నగరమునకు వెళ్తున్నప్పుడు నాతో మేనేజర్ ఇట్లనెను. మీ వలె పని చేసే మరొక అహ్మదీ ఈ ఉద్యోగం చేయదలచిన చెప్పండి. ఈ విషయమును విని నేను మనోభావానికి లోనై కన్నీరు పెట్టుకుంటిని. నేను నా నగరములోని మరొక అహ్మదితో మాట్లాడి అతనికి ఉద్యోగం ఇప్పించినాను. అతణ్ణి కూడ మేనేజర్‌గా నియమించారు. చందాలు ఇవ్వడం వలన నా కుటుంబ ఒత్తడి నాపై వున్నది. కొందరు బంధువుల ద్వారా కూడ నాకు అవమానాలు ఎదురవుతున్నాయి. కాని అల్లాహ్ తఆలా కృపానుసారము చందాలు చెల్లిడం వలన నాకెన్నడు ఆర్థిక ఇబ్బందులు ఎదురు కాలేదు.

ఆస్ట్రేలియా మురబ్బి గారిట్లు తెలిపిరి. పర్త్ నుండి ఒక యువకుడు తన తహ్రీకె జదీద్ చందా ఈ సంవత్సరం చెల్లించలేదు. చందాలు చెల్లించుటకు శ్రద్ధ కలిగించబడగా అతడిట్లు తెలిపెను. కోవిడ్ వలన నాకు పని లభించలేదు. ఆర్థిక ఇబ్బందులు వున్నాయి. కొన్ని రోజుల తర్వాత మరల అతనితో భేటీ కాగా నా చందా చెల్లించుటకు నేను నా ఇంటి వస్తువులను విక్రయించానని అతడు నాకు చెప్పెను. నేను ఇలా చేయగానే నాకు నా వృత్తిపరంగా నాలుగు క్రొత్త పనులు లభించాయి. దానికి తోడు మరో కొత్త ఉద్యోగము కూడ లభించినది. ఇది అన్ని ఖర్చులను చెల్లిస్తుంది. గతము కంటే ఎక్కువ ఆదాయము కూడ లభిస్తుంది. ఇది అల్లాహ్ తఆలా దయ అని, నేను ఇంటి వస్తువులను విక్రయించి చందా చెల్లించనందుకు అల్లాహ్ తఆలా నాకు వెంటనే తిరిగి ఇచ్చినట్లు నేను చూశాను.

ఇంకా ఆస్ట్రేలియా సౌత్‌లోని ఒక నగర తహ్రీకె జదీద్ కార్యదర్శి ఇట్లు తెలిపిరి. ఒక వినమ్రులైన మిత్రుని తహ్రీకె జదీద్ చందా బకాయా వుండెను. నేను నా ఇల్లు విక్రయానికి పెట్టాను. అమ్ముడుపోగానే నేను చెల్లిస్తాను. రెండు రోజుల తర్వాత వారికి ఫోన్ వచ్చెను. వారిట్లు తెలిపిరి. నా ఇల్లు ఊహించని విధంగా లాభముతో అమ్ముడుపోయినది. చందా చెల్లిస్తాననే వాగ్దానము వలన ఇలా జరిగిందని వారికి నమ్మకముండెను. కావున వారు తమ వాగ్దానము కంటే ఆరు రెట్లు అధికంగా చందా తహ్రీకె జదీద్ చెల్లించారు. అల్లాహ్ తఆలా ప్రాపంచిక లాభములతో సత్కరించినప్పుడు కూడ ఇది నా విశిష్టత వలన కాక త్యాగము వలన అని ఇటువైపు శ్రద్ధ కలుగుతుంది. ఇది ఒక అహ్మదీయుని ఆలోచన. మరొకరికి ఇటువంటి ఆలోచన రాలేదు.

అర్జంటైన్ ముబల్లిఘ్ గారిట్లు వ్రాసిరి. ఆర్థిఖ త్యాగము వైపు దృష్టిసారించాలని నేను ఒక వ్యాసము వ్రాశాను. క్రొత్త అహ్మదీయులకు ఆర్థిక త్యాగము చేయుట అనివార్యమని చెప్పవలెనని నా ఖుత్బాల ఆధారంగాఈ వ్రాసిరి. మీకు అహ్మదియ్యత్ సందేశము తహ్రీకె జదీద్‌లో ధన త్యాగము చేసిన వారి వలన అందినదని వారికి చెప్పవలెను. కనుక మీరు ఇందులో చేరండి. తద్వారా మీరు మీ జీవితములను చక్కదిద్దుకోవడంతో పాటు మీరు కూడ ఈ సందేశమును ఇతరులకు అందించిన వారవుతారు. ఈ పంక్తిని వారు నా ఖుత్బా నుండి తీసుకొని ప్రచురించిరి. ఈ వ్యాసము జమాఅత్ సభ్యులకు పంపించబడినప్పుడు ఒక యువకుడు అనస్ హిజ్‌ఖీల్ గారిట్లు తెలిపిరి. వారు నన్ను సంప్రదించి ఇట్లనిరి. తహ్రీకె జదీద్ చందా చెల్లించుటకు నేను మిషన్ హౌజ్ రావాలని అనుకుంటున్నాను. తీవ్ర వేడి వున్నను పాఠశాల ముగిసిన తర్వాత ఒక గంట కంటే ఎక్కువ ప్రయాణము చేసి మిషన్ హౌజ్‌కు చేరుకున్నారు. వచ్చి ఒక వెయ్యి అర్జంటైన్ పేసూ రూ॥ తహ్రీకె జదీద్‌లో సమర్పించిరి. వారిట్లనిరి. నాకు చాలా ఆశ్చర్యము కలిగినది. వారి ఆర్థిక స్థితిగతులు ఇలా లేకుండెను. అయినను ఇంకా వారు విద్యార్థిగా వున్నారు. ఆదాయమునకు వారికి ఎలాంటి మార్గము లేకుండెను. కుటుంబ పరిస్థితులు కూడ అంత మంచిగా లేకుండెను. ఆ రోజు వారు డబ్బులు లేనందున మధ్యాహ్న భోజనము కూడ చేయలేదు. అడిగినప్పుడు వారిట్లు తెలిపిరి. తహ్రీకె జదీద్ వలన మీకు అహ్మదియ్యత్ సందేశము అందినది, కావున క్రొత్త అహ్మదీయులు కూడ తహ్రీకె జదీద్‌లో పాల్గొనాలనే వర్తమాన కలీఫా పంక్తి వలన నేను చాలా ప్రభావితమైనాను. ఒక వైపు నేను ఈ పంక్తిని చదివినాను. మరో వైపు అదే రోజు పవిత్ర ఖుర్ఆన్‌లోని ఈ సూక్తిని చదివితిని. అమరులను, వారి త్యాగములను మీరు మరణించినవారిగా భావించకండి, వారు సదా కొరకు జీవించి వున్నారని అందులో వ్రాసి వుండెను. కావున నేను మరణించిన తర్వాత కూడ ఫలితములు, లాభములు కొనసాగే విధమైన త్యాగము చేయాలని నాకు కోరిక కలిగినది. ఇంకా వారిట్లు తెలిపిరి. ముస్లిమేతరులైన నా కుటుంబ సభ్యులు నా జన్మదినము రోజున నాకు కొంత నగదు కానుకగా ఇచ్చారు. నాకు అహ్మదియ్యత్ సందేశము అందినట్లే ఈ నగదుతో ఇతరులకు అహ్మదియ్యత్ సందేశము అందవలెనని నేను అందులోని మిగిలిన డబ్బులన్నిటిని నేను తహ్రీకె జదీద్ చందాలో చెల్లించాను. అహ్మదియ్యత్ స్వీకరించిన తర్వాత ప్రజలలో ఏర్పడిన విప్లవము ఇది.

క్రొత్త అహ్మదీయులైనను లేదా పాత అహ్మదీయులైనను డబ్బులను అహ్మదియ్యత్ ఎలా ఖర్చు చేస్తుంది, ఎక్కడెక్కడ ఖర్చు చేస్తుంది అని తెలుసుకున్నప్పుడు ప్రత్యేక ప్రభావము పడుతుంది. ఏ జమాఅత్‌లలో ఇటువైపు తక్కువ శ్రద్ధ వున్నదో వారు శ్రద్ధ వహించవలెను. లక్ష్యములు, ఉద్దేశములు, ప్రాధాన్యత చెప్పినచో వారి చందాలు పెరగవచ్చును. ఇలాంటిదే లైబేరియాకు చెందిన ఒక సంఘటన గలదు. ఒక లోకల్ ముఅల్లిమ్ ముర్తజా గారు ఒక జమాఅత్‌లో వున్నారు. వారిట్లు తెలిపిరి. అక్కడ జమాఅత్‌లో అధిక శాతం క్రొత్త అహ్మదీయులున్నారు. క్రైస్తవ మతం నుండి ఇస్లాంఓ ప్రవేశించారు. తహ్రీకె జదీద్ గురించి వారు పర్యటిస్తు ఆ గ్రామానికి చేరుకున్నారు. మధ్యాహ్నము అయినందున అధికంగా ప్రజలు తమ తమ వ్యవసాయ భూముల వద్దకు వెళ్ళి యుండిరి. అక్కడున్న సభ్యులకు వారిట్లు తెలిపిరి. నేటి రాత్రి నేను ఇక్కడే వుంటాను. వంద శాతం సభ్యులు ఈ పవిత్రమైన పథకములో పాల్గొననంత వరకు నేను తిరిగి వెళ్లను. రాత్రికి అందరు తిరిగి వచ్చిన తర్వాత వారు గొప్ప తహ్రీకె జదీద్ ప్రాముఖ్యత, దాని నేపథ్యము తెలిపి అందరు పాల్గొనాలని చెప్పిరి. అల్లాహ్ తఆలా కృపానుసారము స్త్రీ, పురుషులందరు అహమహమికతో పాల్గొన్నారు. మరుసటి వారు తిరిగి పోతున్నప్పుడు ఒక మిత్రులుఅల్ఫాన్సో గారు రెండు నెలల నుండి బయట తమ వ్యవసాయ క్షేత్రంలోనే వుంటున్నారు. వారు తహ్రీకె జదీద్‌లో పాల్గొనలేదని ఎవరో ఒకరు చెప్పిరి. కాని మీరు వారి వద్దకు చేరుకోలేరు. ఎందుకనగా ఒకటి వారి భూమి చాలా దూరమున్నది. మరొకటి వర్షము వలన రహదారి మూసివేయబడినది. నేను వారి వద్దకు కూడ చేరుకుంటానని ముఅల్లిమ్ గారు చెప్పారు. తద్వారా మీ జమాఅత్ సభ్యులు వంద శాంత అ తహ్రీక్‌లో పాల్గొన్నట్లు అవుతుంది. జమాఅత్ సభ్యులు వారికి నివారించుటకు ప్రయత్నించిరి. కాని వారు పట్టుబట్టిరి. కొందరు మిత్రులు వారికి తోడుగా కూడ వెళ్లిరి. రెండున్నర గంటల ప్రయాణము తర్వాత వారు అలాకఫన్సో గారి వద్దకు చేరుకొనిరి. వారికి ఆశ్చర్యముతో పాటు ఆనందము కూడ కలిగెను. వెంటనే వారు తహ్రీకె జదీద్ చందా చెల్లించిరి. అల్ఫాన్సో గారి భార్య, పిల్లలు కూడ వారితో అక్కడే నివాసముంటుండిరి. భార్య ఇంకా అహ్మదీ కాలేదు. ఈ దృశ్యమును మొత్తం చూసి వారి భార్య ఇట్లనిరి. నేను అహ్మదీయుల మత సేవ స్ఫూర్తిని చూసి నేను చాలా ప్రభావితమైనాను. కావున నేడు నేను కూడ ఈ జమాఅత్‌లో చేరుతున్నాను. నా పిల్లలు కూడ ఈ జమాఅత్‌లో భాగస్వాములైతారు. ఇలా దీని శుభము వలన ఒక కుటుంబము అహ్మదియ్యత్‌లో ప్రవేశించు అనుగ్రహము పొందెను.

బైఅత్ తర్వాత ప్రజలలో ఎలా ధన త్యాగము ఎంత ముఖ్యమో ఎలా భావన కలుగుతుంది. మాలీ నుండి ఒకరు అనగా ముబల్లిఘ్ గారిట్లు వ్రాసిరి. ఒక రీజన్‌లో సయ్యదూ అకరున్నారు. ఒక రోజు అహ్మదియ్యహ్ మిషన్ కీతూకు వచ్చి, ఇట్లనుచు తమ తహ్రీకె జదీద్ చందా చెల్లించిరి. తహ్రీకె జదీద్ సంవత్సరం ముగుస్తున్నందున నేను చాలా ఇబ్బంది పడుతుంటిని. తహ్రీకె జదీద్ కొరకు నేను వాగ్దానము చేసిన చందా చెల్లించుటకు నాకు అనుగ్రహము ఇవ్వమని దుఆ చేస్తుంటిని. నేడు అల్లాహ్ తఆలా నన్ను అనుగ్రహించినందున వచ్చాను. వీరు ఒక కాలు లేక వికాలాంగులు. ఎందుకు మీరు కష్టపడ్డారు. మీరు చెప్పినచో మేమే మీ వద్దకు వచ్చేవారము కదా అని అనగా ఎంతో ఉద్రేకముతో ఇట్లనిరి. నేను ఇమామ్ మహ్దీని విశ్వసించాను. ఆరోగ్యపరంగా నేను వికలాంగుడనైనను ఆరోగ్యముతో వున్న వారి కంటే నేను మెరుగైన వాడినని నేను భావిస్తుంటాను. అల్లాహ్ తఆలా కృపానుసారము ధార్మిక వేదన నాకు గలదు. ఇటువంటి పరిస్థితిలో నేను ధర్మ మేలు కొరకు ఇక్కడికి నడిచి రావడం వలన అల్లాహ్ తఆలా వద్ద ఆమోదము పొందెదను కావచ్చును. నా క్షమాపణకు తగు ఏర్పాట్లు కావచ్చును కాబోలు.

మోతూవామా అనే పేరు గల ఒక ముఅల్లిమ్ గారిట్లు తెలిపినారని బెనిన్ ముల్లిఘ్ వ్రాసిరి. వారు తమ ప్రాంతములోని ఒక క్రొత్త జమాఅత్‌లో పర్యటించుటకు వెళ్ళిరి. అక్కడి సదర్ జమాఅత్ ఇస్మాయీల్ గారిట్లు తెలిపిరి. మేము ఆరంభము నుండి ముస్లిములమే. ఎల్లప్పుడు ప్రతి సంవత్సరం ఎంతో కొంత ధనము అల్లాహ్ పేరున అల్లాహ్ మార్గములో మేము ధన త్యాగము చేస్తూ ఇమామ్ గారికి

సమర్పించేవారము. మేము అహ్మదీయులమైన తర్వాత ఇది మొదటి సంవత్సరం. మొదటి సారి మేము అహ్మదియ్యహ్ జమాఅత్‌లో ధన త్యాగము చేశాము. ఇంతకు ముందు మేము ఇచ్చేదంతా ఇమామ్ గారు స్వంతంగా వాడుకునేవారు. కాని మేము అహ్మదియ్యహ్ జమాఅత్ ముబల్లిఘ్ గారికి చందా ఇచ్చినప్పుడు వారిని ఈ డబ్బులు ఎక్కడెక్కడ ఖర్చు చేస్తారో ప్రశ్నించగా మా ధన త్యాగముల ద్వారా చేయబడే మహాగొప్ప ఖర్చులను వారు చెప్పిరి. అవి మాకు తెలియదు. ఈ సాధారణ నగదును కూడ జమాఅత్ వృథా చేయదు. ఈ సాధారణ నగదును కూడ ప్రపంచమంతటా జరుగుతున్న అభివృద్ధి పనులకు, ఇస్లాం ప్రచార కార్యక్రమాలకు ఈ జమాఅత్ వినియోగిస్తుంది. కొన్ని ఫ్రాంక్లు చందా ఇచ్చే వ్యక్తి సైతం దానికి గొప్ప ఫలితము పొందుతాడు. ఈ త్యాగ తత్వమును అర్థము చేసుకొని మేము ధన త్యాగములో పాల్గొన్నాము. ఈ సంవత్సరం మా కుటుంబములలో ఆర్థిక కష్టములు కూడ రాలేదని మేము గమనించాము. మేము మా ఆరోగ్యము, మా పిల్లల ఆరోగ్యము కొరకు పదే పదే మేము చేసే ఖర్చులు కూడ ఈ సంవత్సంరం చేయలేదు. సమాజులలో మా హాజరీ ఇంతకు ముందే కంటే ఎక్కువైనది. అల్లాహ్ తఆలా మమ్ములను రక్షించెను. అల్లాహ్ తఆలా కృపానుసారము ఈ ధన త్యాగము వలన మా త్యాగము వృథా కలేదనే సంతృప్తి, ప్రశాంతత కూడ మాకు కలిగినది. అఫ్రీకాలో వుండే వారు నిరక్షరాస్యులు, సుదరూ ప్రాంతములో వుంటారని ప్రజలు అంటుంటారు. కాని ఇవి ఎంతటి గట్టి అనుభవపూరిత ఆలోచనలనగా ఇవి బాగా చదువుకున్న వారికి కూడ కలుగవు. ఎలా వారు మొత్తం విషయములను తెలిపారు. ధన త్యాగ ప్రాముఖ్యత వారికి ఎంతగా తెలిసినది. బైఅత్ తర్వాత ప్రజలలో కలిగే విప్లవం ఇది.

ఇస్లాం ప్రచారము కొరకు మనలోని ప్రతి ఒక్కరికి త్యాయము చేయుటకు అల్లాహ్ తఆలా అనుగ్రహించుగాక! తమ పవిత్ర ఆదాయముతో త్యాగము చేయువారమగుదుము గాక! అల్లాహ్ తఆలా వద్ద ఈ త్యాగము ఆమోదించబడు గాక! అల్లాహ్ తఆలా మనతో రాజీ పడు గాక!

ఇప్పుడు నేను తహ్రీకె జదీద్ క్రొత్త సంవత్సరమును ప్రకటిస్తున్నాను. కొన్ని గణాంకాలు కూడ తెలుపుతాను. అల్లాహ్ తఆలా కృపానుసారము 31 అక్టోబర్‌తో 87వ సంవత్సరం ముగిసి 88వ సంవత్సరం ప్రారంభమైనది. అల్లాహ్ తఆలా కృపానుసారము తహ్రీకె జదీద్ ధన త్యాగములో 15.3 మిలియన్ పౌండ్ల త్యాగము చేయుటకు అనుగ్రహము జమాఅత్‌కు లభించెను. ఇది గత సంవత్సరం కంటే 8 లక్షల 42 వేల పౌండ్లు అధికం.

జర్మనీ ప్రపంచవ్యాప్తంగా ప్రథమ స్థానంలో నిలిచినది. పాకిస్తాన్ ఆర్థిక సంక్షోభంలో వున్నది. కాని వారు త్యాగములలో వారు ముందే వుంటారు. వారి కొరకు కూడ దుఆ చేయండి. ప్రస్తుతం ఇంకా వారు ఇటువంటి అనేక కష్టములలో చిక్కుకొని వున్నారు. ప్రతి రోజు ఏదో ఒక వ్యాజ్యము వారిపై మోపబడుతుంది. ఎవరోనెర ఒకరికి వ్యతిరేకముగా కేసు పెడుతూ ఉంటారు. అక్కడి చట్టాలు కూడ అహ్మదీయులను ఎంతగా పీడించదలుచుకున్నాయో, బాధించదలుచుకున్నాయో అంతగా ప్రయత్నిస్తూనే ఉన్నాయి. అల్లాహ్ తాలాయే వారి సమస్యలన్నింటిని దూరం చేయును గాకా!. వారు కూడ స్వతంత్రముగా అన్ని రకాల జమాఅత్ కార్యక్రమాలను , సమావేశాలను, జల్సాలను స్వేచ్ఛగా, బాహ్యముగా నిర్వహించుకొందురు గాకా!. వారు తమ త్యాగాలను కూడ బహిర్గతముగా వెల్లడించుకుందురు గాకా!. వారు బహిరంగముగా తెల్పుకోలేరు, కాని వారి మనం ప్రకటించుకొందుము గాకా!. కొన్ని తప్పని పరిస్థితుల కారణంగా వారి త్యాగాలను గూర్చి ప్రకటన చేయడం లేదు.

మొత్తానికి ఈ దేశం కాకుండి త్యాగాలను చేయునట్టి దేశాలను చూసినచో జర్మని మొదటి స్థానంలో, ఇంగ్లాండ్ రెండవ స్థానంలో, అమెరికా మూడవ స్థానంలో , కెనడా నాల్గవ స్థానంలో, మిడిల్ ఈస్ట్‌కు చెందిన ఒక జమాఅత్ 5వ స్థానంలో, భారతదేశం 6వ స్థానంలో, ఆస్ట్రేలియా 7వ స్థానంలో, ఇండోనేషియా 8వ స్థానంలో, ఘానా 9వ స్థానంలో మరొక మిడిల్ ఈస్ట్ జమాఅత్ 10వ స్థానంలో ఉన్నాయి.

ఆఫ్రికా దేశాలలోసామూహికముగా వసూలును చూసినచో ప్రథమ స్థానం ఘానాకు, రెండవ స్థానం నైజీరియాకు, మూడవ స్థానం బుకీనా ఫాసూ, ఆ తరువాత తంజానియా, ఆ తరువాత సెరాలేవన్, సెరాలేవన్‌ను గూర్చి నేను గతంలోనే చెప్పాను. ఇక్కడ ఇంకా చందా అధికముగా చెల్లించువారు గలరు, కావున చూపించవలసిన శ్రద్ధను చూపించడం లేదు. ఒకవేళ సరైన విధముగా ప్రజలకు ఈ జమాఅత్ త్యాగాలను గూర్చి తెల్పినచో నేను అక్కడి సంఘటనలనుగూర్చి తెల్పినట్లుగా చెప్పి చూసినచో తప్పకుండా ప్రయోజనం ఉండును. మొత్తానికి గేంబియా, ఆ తరువాత బెనిన్, ఆ తరువాత యుగాండా, ఆ తరువాత కెన్యా, ఆ తరువాత లైబీరియా.

చందా దారుల సంఖ్యను పెంచు దేశాల పరంగా చూసినచో నైజీరియా మొదటి స్థానంలో ఉంటుంది. ఆ తరువా గేంబియా, ఆ తరువాత సెనిగాల్, ఆ తరువాత ఘానా, ఆ తరువాత తంజానియా, ఆ తరువాత ఘనికనాకరి, ఆ తరువాత మలావి, ఆ తరువాత యుగాండా, ఆ తరువాత గనిబసావూ, కోంగో, కన్సాసా ఆ తరువాత బుకీనా ఫాసూ, కోండో బ్రెజిల్.

చందా దారుల సంఖ్యను పెంచిన ఆఫ్రికన్ దేశాలు గాకుండా ఇతర దేశాలను , వాటి పెద్ద పెద్ద జమాఅత్‌లను చూసినచో జర్మని మొదటి స్థానంలో, ఇంగ్లాండ్, హాలెండ్, బంగ్లాదేశ్, మార్షెస్‌లు గలవు.

మొదటి విడుతకు చెందిన ఖాతాను చూసినచో అల్లాహ్ తాలా అనుగ్రహం వలన అన్ని కొనసాగుచున్నాయి.

ఒకపోతే జర్మనికి చెందిన మొదటి 10 జమాఅత్‌లు ఈ విధముగా గలవు. రోడేర్ మార్క్, నౌయిస్, మహ్ది ఆబాద్, కోలోన్, రోడ్ గావు, నిడా, ఫ్లోరస్ హామ్, పిన్‌బర్గ్, ఫ్రాంక్‌తాల్, ఒస్నా బర్క్.

మొదటి 10 లోకల్ జమాఅత్‌లను చూసినచో హెంబర్గ్, ఫ్రాంక్ ఫర్ట్, గ్రోస్ గెరావూ, డిటిజన్ బాగ్, వేజ్‌బాన్, మోర్‌ఫేల్డన్, రెడ్‌స్టేడ్, మన్‌హాయిమ్, డామ్‌స్టాడ్, రూస్‌లేజ్‌హాయిమ్.

పాకిస్తాన్‌లో తహ్రీకే జదీద్ ఆర్థిక త్యాగాలలో లాహోర్ మొదటి స్థానం, రబ్వా రెండవ స్థానం, ఆ తరువాత కరాచి, ఆ తరువాత జిల్లాల పరంగా చూసినచో ఇస్లామాబాద్, గుజ్రాన్‌వాలా, సియాల్‌కోట్, ఉమర్‌కోట్, ముల్తాన్, టోబాటిక్ సింగ్, మీర్‌పూర్ ఖాస్, అటక్, మీర్‌పూర్ కశ్మీర్, దేరా ఘాజి ఖాన్‌లు గలవు.

వసూలు పరంగా చూసినచో ఎక్కువ ఆర్థిక త్యాగాలు చేసినజమాఅత్‌లు అమారత్ డిఫెన్స్ లాహోర్, అమారత్ గుల్షన్ ఎక్బాల్ కరాచి, అమారత్ అజీజా బాద్ కరాచి, అమారత్ టౌన్ షిప్ లాహోర్, అమారత్ మాడల్ టౌన్ లాహోర్, అమారత్ మొఘల్ పూరా లాహోర్, అమారత్ దిల్లి గేట్ లాహోర్, అమారత్ కల్ఫటన్ కరాచి, బహావు నగర్ నగరం, హాఫిజా బాద్ నగరం.

ఇంగ్లాండ్‌కు చెందిన మొదటి 5 రీజన్‌లను చూసినచో మొదటి స్థానంలో బైతుల్ ఫుతూహ్ రీజన్, రెండవ స్థానంలో మస్జిద్ ఫజల్ రీజన్, ఆ తరువాత ఇస్లామాబాధ్ రీజన్, మిడ్‌లాండ్ రీజన్, బైతుల్ ఎహ్‌సాన్ రీజన్, సామూహిక చందా సేకరణల దృష్ట్యా ఇంగ్లాండ్‌కు చెందిన మొదటి 10 జమాఅత్‌లు హార్న్ హామ్, ఇస్లామాబాద్, సౌత్ చీమ్, మస్జిద్ ఫజల్, వార్‌కాస్టర్ ఫార్క్, బ్రిమింగం, సౌత్ వసాల్, ఆల్డర్ షాట్, జిలింగా, టెలిఫోర్డ్.

సామూహిక వసూలు పరంగా అమెరికాకు చెందిన మొదటి 10 జమాఅత్‌లు మేరిలాండ్, లాస్ ఎంజిల్, డేటరాయిట్, సెలికాన్ వెల్లి, షికాగో, సేయిట్లే, సెంట్రల్ వర్జానియా, ఓష్‌కోష్, అట్లాంటా, జార్జియా, సౌత్ వర్జానియా, హేస్టోన్, యార్క్, బోస్టాన్.

వసూలీ పరంగా కెనడాకు చెందిన లోకల్ అమారత్‌లు ఈ విధముగా గలవు. వాన్, పీస్ విలేజ్ మరియు కేల్‌గరీ సమాన స్థానాన్ని పొందాయి. ఆ తరువాత వాన్‌కోవర్, టొరాంటో వేస్ట్, టొరాంటో.

భారత దేశానికి చెందిన మొదటి 10 జమాఅత్‌లు ఈ విధముగా గలవు: ఖాదియాన్, కోయంబత్తూర్, హైదరాబాద్, కరులోయి, పెత్తా పేరం, కలకత్తా, బెంగుళూరు, కేరంగ్, కాలికట్, మేలాపాలం, చందాల ప్రకారంగా రాష్ట్రాలను చూసినచో కెరళా మొదటి స్థానంలో ఆ తరువాత తమిళనాడు, జమ్ము కశ్మీర్, కర్ణాటక, తెలంగాణ, ఒడిసా, పంజాబ్, బెంగాల్, దిల్లి, లక్షదీవులు.

ఆస్ట్రేలియాకు చెందిన మొదటి 10 జమాఅత్‌లు ఈ విధముగా గలవు. మెల్‌బర్న్ లాంగ్ వార్న్, కాసల్ హిల్, మార్సడన్ పార్క్, మెల్బర్న్ బెర్‌విక్, సౌత్ ఎడ్‌లాండ్, పెన్‌రిత్, ఏసిటి కాన్‌బెర్రా, పారామాటా, వెస్ట్ ఎడ్‌లాయిడ్.

అల్లాహ్ తాలా ఈ త్యాగపరుల ధన, ప్రాణ, ఆత్మ గౌరవాలను కాపాడుగాకా!, శుబములను చేకూర్చుగాకా! (ఆమీన్).

---ఖుత్బా సానియా---

(2వ పేజి తరువాత)వారు జీవించడంతో జమాఅత్ మొత్తం స్వయముగా మరణించును. వంద సం॥ల ఈ వివాదము ఒక్క సారిగా అంతమగును. !!

దీనికి భిన్నముగా అహ్మదియ్య జమాఅత్ విశ్వాసమేమనగా నిస్సందేహముగా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం శుభవార్త ప్రకారము ముహమ్మదీయ సమాజములో మసీహ్ నిశ్చయముగా అవతరింతురు. ఆ అవతరించే మసీహ్ ప్రవక్త అగును. దీనిని మీరు కూడ అంగీకరింతురు. కాని ఆ మసీహ్ ఇస్రాయీల్ సంతతికి చెందినవారు కాక ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సమాజ వ్యక్తి, వారి బానిస అగును. అనుగ్రహము, సత్కారములో ఈసా అలైహిస్సలాంను పోలియుందురు. హజ్రత్ షేఖ్ ముహియుద్దీన్ ఇబ్నె అరబీ రహ్మతుల్లాహు అలైహి కూడ మా అభిప్రాయమును బలపరచుచు ఇట్లనిరి.

وَجَبَ نُزُوْلُهٗ فِىْ اٰخِرِ الزَّمَانِ بِتَعَلُّقِهٖ بِبَدَنٍ اٰخَرَ.

*(తఫ్సీర్ అరాఇసుల్ బయాన్ సంపుటి 1 పుట 262)*

అనగా హజ్రత్ ఈసా అలైహిస్సలాం అంతిమ కాలములో మరొక శరీరము (వ్యక్తిత్వము)తో అవతరించుట అనివార్యము. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తరువాత అవతరించే దైవ ప్రవక్త అయిన మసీహ్ మౌవూద్ వారి సమాజములో, వారితోనే లబ్ధి పొంది రావచ్చును. బయటి నుండి రానే రాలేదు. ఇందులో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సంపూర్ణ ప్రవక్తృత్వ అవమానము కాక వారి సంపూర్ణ ప్రవక్తృత్వ విశిష్టత, వారి పవిత్ర శక్తి లబ్ది నిరూపితమగును. దీనితో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తృత్వ ముద్ర తొలగిపోదు, వారు అంతిమ ప్రవక్త అనుటలో కూడ తేడా రాదు. ఎందుకనగా ఈ స్థితిలో అసలు, శాశ్వత, శాసన ప్రయోజకుని విధంగా వారే అంతిమ యుందురు. లేనిచో హజ్రత్ ఈసా అలైహిస్సలాం మరల ప్రపంచములో వచ్చినచో ఖత్మె నబువ్వత్ ముద్ర తొలగిపోవును. తద్వారా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అవమానము జరుగును.

అహ్మదియ్య జమాఅత్ స్థాపకులు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఈ ముఖ్య విషయమునే ప్రస్తావించుచు ఇట్లనిరి. "ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంపైనే ప్రవక్తృత్వ విశిష్టతలన్ని ముగిసినవని నేను ఎంతో నమ్మకము, దావాతో చెప్పుచున్నాను. వారికి వ్యతిరేకంగా ఒక సంస్థను స్థాపించు వ్యక్తి అసత్యుడు, మోసకారి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తరువాత మరొకరిని ప్రవక్తగా విశ్వసించుచు వారి ఖత్మె నబువ్వత్‌ను ముక్కలు చేయు వ్యక్తి శాపితుడని నేను స్పష్టముగా తెలుపుచున్నాను. అందుకే అదే ముహమ్మదీయ ప్రవక్తృత్వ ముద్ర లేని వ్యక్తి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తరువాత ప్రవక్తగా వచ్చే ఆస్కారం లేదు. మా వ్యతిరేక ముస్లిములు పొరపాటు పడి ఖత్మె నబువ్వత్‌ను విడిచి ఇస్రాయీలీ ప్రవక్తను ఆకాశము నుండి దింపుచున్నారు. నేను తెలుపునదేమనగా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర శక్తి, వారి శాశ్వత ప్రవక్తృత్వ చిన్నపాటి మహిమ ఏమనగా 13 వందల సం॥ల తరువాత కూడ వారి శిక్షణ, బోధనతో మసీహ్ మౌవూద్ వారి సమాజములో అదే ప్రవక్తృత్వ ముద్రను తీసుకొని వచ్చును. ఇది అవిశ్వాసమైనచో నేను ఈ అవిశ్వాసమును ఆశింతును. కాని వీరి తెలివి చీకటి పాలయ్యెను. ప్రవక్తృత్వ కాంతిలోని ఏ భాగము వీరికి లభించలేదు. కనుక దీనిని అర్థము చేసుకోలేరు. దీనిని అవిశ్వాసమని నిర్ణయించుచున్నారు. వాస్తవానికి దీనితో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం విశిష్టత, వారి జీవిత సాక్ష్యము లభించును." *(అల్‌హకమ్: 10 జూన్ 1905 : పుట 2)*

కాని విచిత్ర విషయమేమనగా నేడు కేవలము అహ్మదియ్య జమాఅత్ వ్యతిరేకతలో అంధులై కోపము, ఈర్ష్య, అసూయ భావములకు లోనై సులభంగా ఖ్యాతిని పొందుటకు, సామాన్య ముస్లిములను రెచ్చగొట్టుటకు అహ్మదియేతర ఉలమాలందరు పవిత్ర ఖుర్‌ఆన్ వాస్తవములను ప్రక్కకు పెట్టి ఎంతో అబద్ధము, అసత్యము పలుకుచు "ఖాతమున్నబియ్యీన్" అనగా అన్ని రకాల ప్రవక్తృత్వము శాశ్వతముగా అంతమైనదని, ఇదే ముహమ్మదీయ సమాజ ఏకగ్రీవ విశ్వాసమని అంటున్నారు. వాస్తవానికి ఒక్క వ్యక్తి కూడ విభేదించనప్పుడే ఏకగ్రీవ విశ్వాసమనబడును. ఈ విశ్వాసములో ఒక్కరిద్దరే కాదు గొప్ప పండితులు తమ విభేదమును తెలిపిరి. వారి అభిప్రాయములను నేను తరువాత ప్రస్తావింతును. ప్రస్తుతము ఖత్మె నబువ్వత్ గురించి నేను కొన్ని విషయములను తెలిపెదను.

మన సాధారణ ముస్లిం సోదరులు వారి ఉలమాలు ఖత్మె నబువ్వత్ గురించి తమ విశ్వాస సాక్ష్యముగా కేవలము ఒక్క సూక్తిని وَلٰكِنْ رَّسُوْلَ اللّٰهِ وَخَاتَمَ النَّبِيّٖنَ మాత్రమే ప్రవేశపెట్టెదరు. ఈ సూక్తియే విచారార్హణ గలది. పవిత్ర ఖుర్‌ఆన్ పద్ధతి يُفَسِّرُ بَعْضُهٗ بَعْضًا ఏమనగా అదొక అంశమును తెలిపినప్పుడు వివిధ చోట్ల దానిని విశదీకరించును, స్పష్టము చేయును. కాని ఈ ముఖ్యమైన అంశములో పవిత్ర ఖుర్‌ఆన్ وَلٰكِنْ رَّسُوْلَ اللّٰهِ وَخَاتَمَ النَّبِيّٖنَ అని మౌనము పాటించెను. మన ముస్లిం సోదరులు దీనితో వెలికితీయదలచిన అంశమును దీనిని బలపరచుటలో ప్రస్తావించక పోవడమే కాక దీనికి వ్యతిరేకంగా అనేక చోట్ల ప్రస్తావించడం, ఆంహత్ర్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తృత్వ లబ్ధిని ఇతర ప్రవక్త కంటే గొప్ప రీతిలో విస్తృతంగా ప్రవేశ పెట్టుట మన ముస్లిం సోదరులు ఖాతమున్న బియ్యీన్ సూక్తితో తీయదలచిన అర్థము, భావము కాదనుటకు గట్టి నిదర్శనము.

అరబ్బీ నిఘంటువు ప్రకారము 'ఖతమ్' నకు మూడు అర్థములు తెలుపబడెను. ఇమామ్ ఇస్ఫహానీ రాఘిబ్ రహ్మతుల్లాహ్ అలైహి తమ పుస్తకము "ముఫ్రదాతె రాఘిబ్" లో 'ఖతమ్' అను పదమును ప్రస్తావించిరి.

(1) 'ఖతమ్'నకు మొదటి అసలు అర్థము "తాసీరుష్షైయి" ఇతర వస్తువులపై తమ ప్రభావము వేయుట. ఉదా॥ ముద్ర తన చిత్రము, ప్రభావమును ఇతర వస్తువులపై వేయును.

(2) 'ఖతమ్' నకు రెండవ అర్థము నిలుపుదల, నివారించుట కూడ. కాని ఇది అసలు అర్థము కాక భావార్థము. ఉదా॥ خَتَمَ اللّٰهُ عَلٰى قُلُوْبِهِمْ وَعَلٰى سَمْعِهِمْ అల్లాహ్ వారి హృదయములపై ముద్ర వేసెను. అనగా సత్యమును స్వీకరించకుండా వారి హృదయముపై ముద్ర వేసెను. కాని ప్రతి విషయము కొరకు వారి హృదయములు మూసుకపోలేదు.

(3) 'ఖతమ్' నకు మూడవ అర్థము చివరి వరకు చేరుట కూడ. కాని ఇది కూడ అసలు అర్థము కాక భావార్థమే. ఉదా॥ ఇట్లందురు. నేను పవిత్ర ఖుర్‌ఆన్ ను ముగించినాను. దీని అర్థము ఖుర్‌ఆన్‌ను మూసి వేయుట లేదా ఆటంకము సృష్టించుట కాదు. తిలావత్ చేయుచు దాని చివరి వరకు చేరినామని దీని అర్థము.

'ఖతమ్'నకు నిజమైన నిఘంటువు అర్థము ఇతర వస్తువులో తమ చిత్రములను పుట్టించుట అని దీనితో స్పష్టమగుచున్నది. ఇదే అసలైన అర్థము. ఇతరత్రా అన్ని భావార్థములే. భాషా పండితుల ఆమోదిత సూత్రాను సారము ఒక పదమునకు అసలు అర్థము చేయుటలో ఆటంకముగా ఏర్పడే సూచన

99633 83271 Pro. SK.Sultan 97014 62176
Oxygen Nursery
All kind of Plants are Available.
➤ Rajahmundry
➤ Kadiyapu lanka, E.G.dist.
➤ Andhra Pradesh 533126.
➤ #email. oxygennursery786@gmail.com
Love for All...Hatred for None

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దుఆ ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)

దాని వెనుక ముందు వుండనంత వరకు భావార్థము తీసుకోరాదు. ఉదా॥ పులి అను పదమునకు తన అసలు అర్థము ప్రకారము అడవిలో యుండే క్రూర జంతువును తలపించును. కాని మనము ఒక మానవున్ని ఇతడు పులి అన్ని అన్నచో ఇక్కడ మానవుడు అను సూచన పులి అనగా క్రూర జంతువు కాక ధైర్యవంతుడైన మానవుడని తెలుపును. ఇదే విధముగా ఖాతమున్నబియ్యీన్‌లో ఖాతమ్ అను పద నిజమైన అర్థము ఇతరులలో తమ ప్రభావములను వేయు ప్రవక్తల ముద్ర. ఇది వరమును ప్రసాదించుటను సూచించును. వరమును అంతము చేయుట కాదు. ఖాతమున్నబియ్యీన్ సూక్తిలో దాని అసలు అర్థము తీసుకొనుటలో ఆటంకము ఏర్పడు ఎటువంటి సూచన లేనందున ఆమోదిత సూత్రముల మేరకు ఇక్కడ భావార్థము తీసుకొనుట సమంజసము కాదు. భావార్థము తీసుకోదలచినచో ఆ అర్థములను పరిమిత, నిర్ణయించి మాత్రమే తీసుకోవచ్చును. ఖాతమున్నబియ్యీన్ అసలైన అర్థమును దృష్టిలో యుంచుకొని అహ్మదియ్య జమాఅత్ స్థాపకులు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"వైభవోపేతుడైన అల్లాహ్ తాలా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఖాతమ్ గల వారిగా చేసెను. అనగా విశిష్టతలు ప్రసాదించే ముద్ర అందించెను. ఇది మరో ప్రవక్తకు నొసంగబడలేదు. అందుకే వారి పేరు ఖాతమున్నబియ్యీన్ అయినది. వారి ఆధ్యాత్మిక దృష్టి ప్రవక్తను సిద్ధము చేయును. ఈ పవిత్ర శక్తి మరెవ్వరికి లభించలేదు."

*(హాషియా హఖీఖతుల్ వహీ : పుట 97)*

ఈ అభిప్రాయమును బలపరచుటకు మనము మొదటగా పవిత్ర ఖుర్‌ఆన్ నుండే వివరణ తీసుకొందాము. పవిత్ర ఖుర్‌ఆన్‌లోని మొదటి అధ్యాయములోనే అల్లాహ్ తాలా ముస్లిములకు ఈ దుఆ నేర్పించెను.

اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِیۡمَ ۙ﴿۶﴾ صِرَاطَ الَّذِیۡنَ اَنۡعَمۡتَ عَلَیۡهِمۡ ۬ۙ غَیۡرِ الۡمَغۡضُوۡبِ عَلَیۡهِمۡ وَلَا الضَّآلِّیۡنَ ﴿۷﴾

అనువాదము: మమ్ము సత్పథమున నడిపించుము. నీ అనుగ్రహమునకు పాత్రులైన వారి, ప్రకోపమునకు గురి కాని వారి, దుర్మార్గులు కాని వారి మార్గము నందు మమ్ము నడిపించుము.

ప్రతి ఆచరణాత్మక ముస్లిం రోజుకు కనీసం 32 సార్లు ఐదు నమాజులలో ఈ దుఆను చదువును. ముహమ్మదీయ సమాజము కంటే ముందు ప్రజలకు లభించిన వరములన్నియు మీకు కూడ లభించునని ఇందులో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులకు ఒక గొప్ప శుభవార్త గలదు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖాతమున్నబియ్యీన్ అయినందున ఆ వరములన్నియు అంతమైనవను ఆలోచన మీ మనసులలో రాకూడదు. ఈ దుఆలో కేవలము మార్గదర్శనమును కోరుట మాత్రమే ఉద్దేశము కాదను విషయము ఇక్కడ గుర్తుంచుకోవలసిన అవసరమున్నది. ఇంతే ఉద్దేశితమైయున్నచో اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِیۡمَ ۙ﴿۶﴾ అంటే సరిపోయేది. దీనికి తోడు صِرَاطَ الَّذِیۡنَ اَنۡعَمۡتَ عَلَیۡهِمۡ ۬ۙ పదములను పెంచవలసిన అసవరము లేకుండెను. ఈ పదములను పెంచడంతో ఖత్మె నబువ్వత్ తప్పుడు అభిప్రాయమును ఖండించుచు గతములో ప్రజలు పొందిన వరుములను పొందుటకు ఈ దుఆ నేర్పించబడెనని స్పష్టమగుచున్నది. గత పక్షములు పొందిన బహామానములను అల్లాహ్ తాలా మరో చోట ఇట్లు వివరించెను.

وَاِذۡ قَالَ مُوۡسٰی لِقَوۡمِهٖ یٰقَوۡمِ اذۡكُرُوۡا نِعۡمَةَ اللّٰهِ عَلَیۡكُمۡ اِذۡ جَعَلَ فِیۡكُمۡ اَنۡۢبِیَآءَ وَجَعَلَكُمۡ مُّلُوۡكًا ٭ۖ

(అల్ మాయిదహ్: 21) అనగా మూసా అలైహిస్సలాం తన జాతితో ఇట్లనిరి. 'ఓ నా జాతి ప్రజలారా! అల్లాహ్ మీకు చేసిన ఉపకారమును గుర్తు చేసుకొనుము. మీలోనే అతడు సందేశహరులను నియమించెను. మిమ్ములను రాజులుగా చేసెను." ఇప్పుడు ఫాతిహా అధ్యాయపు దుఆను ఈ పవిత్ర సూక్తిని సంయుక్తముగా చూచినచో ముస్లిములకు కూడ ప్రవక్తృత్వము, రాజరికము రెండు రకముల బహుమానములు లభించునని స్పష్టమగును. ఎందుకనగా అది ఉత్తమ సమాజము, సర్వోత్తమ ప్రవక్తను విశ్వసించేవారు. మరో చోట అల్లాహ్ తఆలా ఇట్లనెను.

وَمَنۡ یُّطِعِ اللّٰهَ وَالرَّسُوۡلَ فَاُولٰٓئِكَ مَعَ الَّذِیۡنَ اَنۡعَمَ اللّٰهُ عَلَیۡهِمۡ مِّنَ النَّبِیّٖنَ وَالصِّدِّیۡقِیۡنَ وَالشُّهَدَآءِ وَالصّٰلِحِیۡنَ ۚ وَحَسُنَ اُولٰٓئِكَ رَفِیۡقًا ﴿۷۰﴾

(అన్నిసా: 70) "అల్లాహ్‌కు ఈ ప్రవక్తకు ఎవరు విధేయులో వారు అల్లాహ్ వరమును పొందిన వారితో నుందురు. అనగా ప్రవక్తలు, సత్యమూర్తులు, ఆత్మార్పణము చేసికొన్నవారు, ధర్మమూర్తులు, వీరు పరమ స్నేహితులు."

ఈ పవిత్ర సూక్తితో ఫాతిహా అధ్యాయములో ప్రస్తావించబడిన బహుమానము గురించి మరింత వివరణ తెలియును. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుకరణతో ఒక నిజమైన ముస్లిం సత్యవంతుని స్థాయి నుండి ప్రగతి చెంది ప్రవక్తృత్వ స్థాయి వరకు చేరవచ్చును. జమాఅతేతర ఉలమాలు ఈ సూక్తి అనువాదము చేసినట్లు అల్లాహ్ తఆలా, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం విధేయులు కేవలం బాహ్య రూపంలో ప్రవక్తల వెంట యుందురని కాని ప్రవక్త కారని అర్థము చేసినచో ఇదే వివరణ ఇతర మూడు స్థాయిలకు కూడ వర్తించును. అనగా వారు సత్యమూర్తుల వెంట యుందురు కాని సత్యమూర్తులు కాలేరు. అమరుల వెంట యుందురు కాని అమరులు కాలేరు. వారు ధర్మమూర్తుల వెంట యుందురు కాని ధర్మమూర్తుల స్థాయిని పొందలేరు. ఈ వివరణ నిరర్థకమే కాక అసమంజసమైనదనుట విధితమే. ఎందుకనగా ఈ అర్థము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గొప్ప స్థాయికి విరుద్ధమైనది. నవూజుబిల్లాహ్! వారి అనుకరణతో ఒక వ్యక్తి సత్యమూర్తుల, ధర్మమూర్తుల స్థాయికి చేరలేడు. ముహమ్మదీయ సమాజములో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుకరణతో ప్రవకత్తృత్వ ద్వారమును ఈ సూక్తి స్పష్టముగా తెరుచుచున్నది. మన సాధారణ ముస్లిం సోదరులు ప్రవేశపెడుచున్న ఖత్మె నబువ్వత్ భావమును ఖండించుచున్నది.

ఖాతమున్నబియ్యీన్ సూక్తి భావమును అందరికంటే ఎక్కువ సయ్యద్నా హజ్రత్ అఖ్దస్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం అర్థము చేసుకునేవారు. కనుక ఈ విభేదమునకు పరిష్కారమును మనము పవిత్ర ఖుర్‌ఆన్ తరువాత ప్రవక్త దర్బారులో అన్వేషించెదము. ఖాతమున్నబియ్యీన్ సూక్తి హిజ్రి 5వ సం॥లో అవతరించినదని చరిత్ర ద్వారా నిరూపితమగుచున్నది. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం సుపుత్రుడు హజ్రత్ ఇబ్రాహీమ్ హిజ్రి 9వ సం॥లో మృతి చెందిరి. వారి మరణము సందర్భమున హుజూర్ (స) ఇట్లనిరి. لَوۡعَاشَ لَكَانَ صِدِّیۡقًا نَبِیًّا *(ఇబ్నె మాజా సంపుటి 1 కితాబుల్ జనాఇజ్ పుట 237)*

అనగా ఇబ్రాహీమ్ (రజి) జీవించి యుంటే తప్పక సత్యమైన సందేశహరుడు అయ్యేవారు. ఖాతమున్నబియ్యీన్ సూక్తి అవతరించి 4 సం॥ అయిన తరువాత హుజూర్ అక్రమ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ పదములను పలికిరి. అయినను ఇబ్రాహీమ్ (రజి) జీవించి యుంటే తప్పక సత్యమైన సందేశహరుడు అయ్యేవారని వారనిరి. మన వ్యతిరేక ఉలమాలు చెప్పిన విధముగానే ఖత్మె నబువ్వత్ భావము యుండినచో ఇబ్రాహీమ్ (రజి) జీవించి యున్నను

| | |
|---|---|
| **పవిత్ర ఖుర్‌ఆన్ బోధనలు** | ఓ జనులారా! మీ ప్రభువు నుండి మీ వద్దకు సత్యముతో ప్రవక్త వచ్చియున్నాడు. కనుక విశ్వసింపుడు. ఇది మీకు మంచిది. అయినను మీరు నిరాకరించినచో భూమ్యా కాశముల యందున్న దంతయు నిశ్చయముగా అల్లాహ్‌దే. (నిసా: 171). |

దుఆ ఆశించువారు: ***Muhammad Nazeer Ahmad sb, Ameer Zila warangal, (Telangana)***

| | |
|---|---|
| **పవిత్ర ఖుర్‌ఆన్ బోధనలు** | ముందు విశ్వసించి, తరువాత విశ్వానరహితులై, తిరిగి విశ్వసించి, మరల విశ్వాస రహితులై, విశ్వాసరాహిత్యమును పెంపొం దించుకొను వారిని నిశ్చయముగా అల్లాహ్ ఎన్నడును క్షమించడు. వారికి నరియైన మార్గమును చూపడు. (నిసా: 138) |

దుఆ ఆశించువారు: ***Muhammad Vazeer Ahmad sb Babu, Ameer Zila Mahboobnagar, (Telangana)***

సందేశహారుడు కాకుండునని అనేవారు. ఎందుకనగా ఇందుకు ఖాతమున్నబియ్యీన్ సూక్తి అవరోధముగా మారును. కాని హుజూర్ (స) అలా అనలేదు. ఇబ్రాహీమ్ (రజి) జీవించి యుంటే తప్పక సత్యమైన సందేశహారుడు అయ్యేవారని అన్నారు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖాతమున్నబియ్యీన్ అయినను ముహమ్మదీయ సమాజములో ప్రవక్తృత్వ ద్వారము తెరిచియున్నదని తెలుపుటకు ఇది స్పష్టమైన, గట్టి సాక్ష్యము. వారినే మనము సమాజపు ప్రవక్త అని అందురు.

ఫిఖ హన్ఫియా ప్రముఖ ఇమామ్ ముల్లా అలీ ఖారి(హి॥1014. క్రీ॥శ॥1606)ఈ హదీసును వివరించుచు ఇట్లనిరి.

لَوْعَاشَ اِبْرَاهِيْمَ وَصَارَ نَبِيًّا وَكَذَا لَوْ صَارَ عُمَرُ نَبِيًّا لَكَانَ مِنْ اِتْبَاعِهٖ عَلَيْهِ السَّلَامَ فَلَا يُنَاقِضُ قَوْلَهٗ خَاتَمَ النَّبِيّٖنَ اِذَا لْمَعْنٰى اَنَّهٗ لَا يَأْتِيْ بَعْدَهٗ نَبِيٌّ يَنْسَخُ مِلَّتَهٗ وَلَمْ يَكُنْ مِنْ اُمَّتِهٖ۔

(మౌజూఆత్ కబీర్: 58-59) అనగా ఇబ్రాహీమ్ (రజి) జీవించి యుండినచో ప్రవక్త అయ్యేవారు. ఇదే విధముగా ఉమర్ (రజి) ప్రవక్త అయ్యేవారు. వీరిద్దరు వారి అనుకరణలోనే యుండేవారు. కనుక ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ వ్యాఖ్యానము (ఇబ్రాహీమ్ జీవించియుండినచో ప్రవక్త అయ్యేవారు) ఖాతమున్నబియ్యీన్ సూక్తికి విరుద్ధము కాదు. ఎందుకనగా ఈ సూక్తి భావమేమనగా వారి సమాజమును రద్దు చేయు ప్రవక్త రాలేదు, వారి సమాజమునకు చెందని ప్రవక్త కూడ రాలేదు. ఇదే విశ్వాసమును తెలుపుచు అహ్మదియ్య జమాఅత్ స్థాపకులు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. "ఒక సమాజపు వ్యక్తి కేవలము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుకరణ వలన దైవవాణి, సువార్తవాణి ప్రవక్తృత్వ స్థాయి పొందినచో, సందేశహారుని పేరుతో సత్కరించబడినచో దీని వలన ప్రవక్తృత్వ ముద్ర తొలగిపోదు. ఎందుకనగా అతను సమాజపు వ్యక్తి, అతని స్వంత ఉనికి ఏమియును లేదు. అతని విశిష్టత అతను అనుసరించిన ప్రవక్త విశిష్టత. అతడు ప్రవక్త మాత్రమే అనబడడు, ప్రవక్త, సమాజపు వ్యక్తి అని అనబడును. కాని సమాజపు వ్యక్తి కాని ప్రవక్త వచ్చినచో ఖత్మె నబువ్వత్‌నకు విరుద్ధము ఏర్పడును." *(చశ్మ మసీహీ: 69 హాషియా)*

శ్రీ॥ హజ్రత్ ఆయిషా రజియల్లాహు తాలా అన్హా విద్యా స్థాయి చాలా గొప్పదని ముస్లిములందరి ఏకగ్రీవ నమ్మకము. వారు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర సతీమణి. పవిత్ర ఖుర్‌ఆన్ భావములను అర్థము చేసుకొనుటలో ప్రత్యేక నైపుణ్యము కలిగియుండిరి. పెద్ద పెద్ద అనుచరులు వారితో సందేహాలు అడిగేవారు. వారిట్లనిరి. قُوْلُوْا اِنَّهٗ خَاتَمُ الْاَنْبِيَآءِ وَلَا تَقُوْلُوْا لَا نَبِيَّ بَعْدَهٗ *(దుర్రె మన్సూర్ : సంపుటి 5 పుట 204)* అనగా ఓ ప్రజలారా! ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖాతముల్ అన్బియా అని అనగలరు. కాని వారి తరువాత ఎటువంటి ప్రవక్త రాడని అనకుము. ఇప్పుడు చెప్పండి! తమ తప్పుడు అభిప్రాయముపై మొండిగా వ్యవహరించుచున్న నేటి ముల్లాల పవిత్ర ఖుర్‌ఆన్ పట్ల వివేకము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం, హజ్రత్ ఆయిషా (రజి) కంటే ఎక్కువా ?

హజ్రత్ ఆయిషా రజియల్లాహు తాలా అన్హా గారి ఈ వాఖ్యమును వివిధ గొప్ప విద్యావంతులు బలపరచినారు. దీనికిట్లు భావము తెలిపిరి. ఇక ముందు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సమాజమును రద్దు చేయు, వారి సమాజమునకు చెందని ఎటువంటి ప్రవక్త రాలేదు. కనుక సమయ భావం వలన ఆ గొప్ప విద్యావంతుల పేర్లను మాత్రమే వెల్లడించగలను.

**(1)** షేఖుల్ ఇమామ్ హజ్రత్ ఇబ్నె ఖయ్యిమ్, (మరణము 267 హిజ్రి) **(2)** ఆసియాలోని భారత, పాకిస్తాన్ ప్రముఖ ముహద్దిస్, విద్యావంతులు హజ్రత్ ఇమామ్ ముహమ్మద్ తాహిర్: (మరణము హిజ్రి 986, క్రీ॥శ॥1578) **(3)** ఖుతుబుల్ అఖ్తాబ్ ఇమామ్ రబ్బాని ముజద్దిద్ అల్ఫె సాని హజ్రత్ షేఖ్ అహ్మద్ ఫారూకీ సర్‌హింది. (మరణము:హిజ్రి 1034, క్రీ॥శ॥1624) **(4)** ఇస్లాం ప్రపంచములో ప్రముఖ, గొప్ప సూఫీ, ప్రఖ్యాత రచయిత, ప్రముఖ ముతకల్లిమ్ హజ్రత్ ఇమామ్ అబ్దుల్ వహాబ్ షీరాని. (మరణము: హిజ్రి 976, క్రీ॥శ॥1568) **(5)** ఆరవ శతాబ్దపు ప్రముఖ హిస్పానీ విశ్లేషకులు షేఖ్ అక్బర్ హజ్రత్ ముహియుద్దీన్ ఇబ్నె అరబి (రహ్మ): (మరణము: హిజ్రి 638, క్రీ॥శ॥ 1240) **(6)** 12వ శతాబ్దపు ముజద్దిద్, భారత దేశములో పవిత్ర ఖుర్‌ఆన్ ప్రథమ పారసీక అనువాదకులు హజ్రత్ సయ్యద్ వలియుల్లాహ్ షాహ్ ముహద్దిస్ ఢిల్లీ (మరణము: హిజ్రి 1171, క్రీ॥శ॥1762) **(7)** అహ్లె సున్నత్ ప్రముఖ విద్యావంతులు హజ్రత్ మౌలానా అబుల్ హసనాత్ అబ్దుల్ హై లఖ్నవీ ఫిరంగీ ముహల్ల : (మరణము: హిజ్రి 1304, క్రీ॥శ॥ 1886) **(8)** మౌలానా ముహమ్మద్ ఖాసిమ్ నానూత్వీ గారు: (మరణము: క్రీ॥శ॥ 1880) **(9)** దారుల్ ఉలూమ్ దేవుబంద్ మాజీ నిర్వహకులు ఖారీ ముహమ్మద్ తయ్యిబ్ గారు. ఖత్మె నబువ్వత్ భావము అహ్మదియ్య జమాఅత్ చేయుచున్న విధముగానే అనేకులైన వీరందరు చేసిరి. ఖత్మె నబువ్వత్‌ను సమాజ ఏకగ్రీవ విశ్వాసమని చెప్పుకునే వారు ఎంతటి తప్పిదమైన భావములో యున్నారో గ్రహించగలరు. అహ్మదియ్య జమాఅత్ స్థాపకులు ఇట్లు తెలిపిరి.

"నూతన శాసన ఆదేశములతో కూడిన ప్రవక్తృత్వము మాత్రమే అంతమైనది లేదా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుకరణను వీడి ప్రకటించబడని దావా. కాని ఒక వ్యక్తిని దైవవాణిలో అల్లాహ్ తఆలా సమాజపు వ్యక్తిగా అభివర్ణించగా రెండవ వైపు అతని పేరు సందేశహారుడని నిర్ణయించినచో ఈ దావా పవిత్ర ఖుర్‌ఆన్‌నకు విరుద్ధము కాదు. ఎందుకనగా ఈ ప్రవక్తృత్వము సమాజపు వ్యక్తి అయినందున ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తృత్వమునకు ఛాయగా యుండును. పూర్తి స్థాయి స్వతంత్ర ప్రవక్తృత్వము కాదు."

*(జమీమ బరాహీనె అహ్మదియ్య 5వ భాగము పుట 177-178)*

తమ ప్రవక్తృత్వ బిరుదు గురించి వారిట్లనిరి.

"ఈ సత్కారము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుకరణతో నాకు లభించినది. నేను ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సమాజ వ్యక్తిని కానిచో, వారిని అనుకరించనిచో ప్రపంచములోని పర్వతములకు సమానంగా నా కర్మలు యుండినను ఈ దైవవాణి సత్కారము పొందేవాడిని కాదు. ఎందుకనగా ఇప్పుడు ముహమ్మదీయ ప్రవక్తృత్వము తప్ప మిగతా ప్రవక్తృత్వములన్నియు అంతమైనవి. శాసనముతో కూడిన ఏ సందేశహారుడు రాలేడు. కాని ముందుగానే సమాజపు వ్యక్తి అయిన శాసనరహిత సందేశహారుడు రావచ్చును. ఇదే తరహాలో నేను సమాజపు వ్యక్తిని, ప్రవక్తను కూడ." *(తజల్లియాతె ఇలాహియ్య : పుట 24)*

సారాంశమేమనగా ఖత్మె నబువ్వత్ అర్థము వరమును అంతము చేయుట కానే కాదు. ఇలా భావించినచో వారు ప్రపంచ దయాసాగరులైనను ఆధ్యాత్మిక సర్వ స్థాయిలను మూసివేసిన వారగుదురు. తద్వారా ఇలా వారి అవమానము ఏర్పడును. ఏ విధముగాను ఇది సమంజసము కాదు. ఇక ముందు అన్ని రకాల ఆధ్యాత్మిక వరములు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి

| హదీస్ వాఖ్యములు | "ఎవరైతే నాకు సలాంలు పంపుతారో వారికి సమాధానం ఇవ్వడం కొరకు అల్లాహ్ తాలా నా ఆత్మను తిరిగి పంపిస్తాడు. తద్వారా నేను వారి సలాంకు ప్రతి సలాంను పంపగలను" (అబూ దావూద్, కితాబుల్ మనాసిక్) |
|---|---|

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*

**నూరుల్ ఇస్లాం శాఖ:**
అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌ను గూర్చి సరైన వివరాలు తెలుసుకోవడం కోసం మీరు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించగలరు.
**టోల్ ఫ్రీ నెంబర్: 1800 103 2131**
సంప్రదించు సమయం: ప్రతిరోజు ఉదయం 08:30 నుండి రాత్రి 10:00 వరకు. (ప్రతి శుక్రవారం సెలవు).

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: mdakbar1451@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817
Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక
Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA
POSTAL REG NO GDP-38/2020-2022, Vol. 6. Thursday, 16 DEC 2021 Issue No. 50.

MANAGER
SHAIKH MUJAHID AHMAD
Mobile. : +91 99153 79255
e-mail:managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.575/- (Per Issue: 11/- ) (WEIGHT: 20-50, grms / issue)

వసల్లం అనుకరణ, విధేయతతోనే లభించుననుట నిజమైన విషయము.

ఖత్మె నబువ్వత్ రక్షణ అను పునాది రహిత దావాదారులు తమ ఆత్మ పరిశీలన చేసుకొన్నచో వారే అందరి కంటే పెద్ద ఖత్మె నబువ్వత్ తిరస్కృతులని తేలిపోవును. ఎందుకనగా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తరువాత ముహమ్మదీయ సమాజము సంస్కరణ కొరకు అల్లాహ్ తఆలా ప్రవక్త అయిన హజ్రత్ ఈసా అలైహిస్సలాం అవతరింతురని వారు విశ్వసించుచున్నారు. ఒక వైపు అన్ని రకాల ప్రవక్త ృత్వము ముగిసినదని వాదించుచున్న వ్యక్తి రెండవ వైపు ఒక్క శ్వాసలోనే అల్లాహ్ ప్రవక్త ఈసా అవతరింతురని అంటున్నందున ఖత్మె నబువ్వత అక్కడికి పోయినది ? لَانَبِیَّ بَعۡدِیۡ ఏమైనది. సామాన్య ముస్లిములను చేయుచున్న స్పష్టమైన మోసమిది.!!

నేడు భూమండలంపై ఖత్మె నబువ్వత్ గొప్ప స్థాయి రక్షణలో హృదయపూర్వక సేవలు కేవలం అహ్మదియ్యా జమాఅత్ మాత్రమే అందించుచున్నది. ప్రపంచ అవిశ్వాస, శిలువ మైదానములలో పవిత్ర కలిమ لَاۤاِلٰہَ اِلَّا اللّٰہُ مُحَمَّدٌ رَّسُوۡلُ اللّٰہِ దైవ ఏకత్వ పిలుపును మారుమ్రోగించుచు ఇస్లాం నిజైమన, కాంతి వంతమైన, అందమైన ముఖమును ప్రపంచము ముందు ప్రదర్శించుచ్నుది. ఫలితముగా ఇస్లాం, ఇస్లాం స్థాపకులను దూషించేవారు నేడు ఖాతమున్నబియ్యీన్ హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం బానిసత్వములో గర్వ పడుచు రేయింబవళ్లు వారిపై దురూద్ పంపురైనారు.

తహఫ్ఫుజ్ ఖత్మె నబువ్వత్ సంస్థలను ఏర్పాటు చేసుకొని సాధారణ ప్రజలను తప్పుద్రోవ పట్టించుచున్న వారు కాస్త గమనించగలరు. సయ్యద్నా హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ అలైహిస్సలాం ఎప్పుడైతే మసీహ్ మౌవూద్, సమాజపు ప్రవక్తగా దావా చేసినారో అప్పటి నుండి అనగా 125 సం॥ల నుండి ఇటువంటి వ్యతిరేక సంస్థలు అన్ని విధాలా కష్టపడినను పరాజయం, విఫలం తప్ప ఏమి సాధించినారు ? రెండవ వైపు అహ్మదియ్యా జమాఅత్ గత 125 సం॥ల నుండి 207 దేశములలో ఎంతో ప్రగతి చెందుచు ఇస్లాం శాంతియుత బోధన, ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సజీవ ప్రవక్త, పవిత్ర ఖుర్ఆన్ సజీవ గ్రంధము, ఇస్లాం దేవుడు సజీవుడను సాక్ష్యమును నిదర్శనముల ద్వారా ప్రపంచములో వ్యాపించుచున్నది. "అందరిని ప్రేమించు – ఎవ్వరిని ద్వేషించకు" అను సూత్రమును పాటించుచు యావత్ జగత్తులో మానవత్వముతో ప్రేమ, సామరస్యము, సత్ప్రవర్తనను ప్రోత్సహించుచున్నది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఎంతో గొప్పగా ఇట్లు చెప్పిరి.

یہ فتوحاتِ نمایاں یہ تواتر سے نشاں کیا یہ ممکن ہے بشر سے کیا یہ مکّاروں کا کار

స్పష్టమైన ఈ విజయములు, వరుస సంకేతములు మానవునితో
సాధ్యమేనా ? మోసకుని పనేనా ?

یہ اگر انساں کا ہوتا کاروبار اے ناقصاں ! ایسے کاذب کیلئے کافی تھا وہ پروردگار

ఓ అవివేకి! ఇది మానవ కార్యమైనచో, ఇటువంటి అసత్యునికి ఆ దేవుడే
బుద్ధి చెప్పియుండును.

کچھ نہ تھی حاجت تمہاری نَے تمہاری مکر کی خود مجھے نابود کرتا وہ جہاں کا شہریار

మీరు కుట్రలు పన్నవలసిన అవసరము లేకుండెను. ప్రపంచ పాలకుడే
నన్ను హతమార్చి యుండును

ఇదే విధముగా హుజూర్ అలైహిస్సలాం తమ జమాఅత్ విజయము, ప్రగతి గురించి ఇట్లనిరి.

"అల్లాహ్ తాలా పదే పదే నాకిట్లు వార్తనందించెను. అతడు నాకు ఎంతో గొప్పతనము ప్రసాదించును, నా ప్రేమను హృదయములలో నాటును, నా సంస్థ ప్రజలు విద్య, విజ్ఞానములో ఎంత నైపుణ్యము చెందుదురనగా తమ సత్య జ్యోతి, తమ నిదర్శనములు, తమ సంకేతములతో అందరిని అసమాధానపరచుదురు. ప్రతి జాతి ఈ చెలిమ నుండి నీరు త్రాగును. ఈ సంస్థ ఎంతో వేగముగా పెరుగును, వ్యాపించును. తుదకు భూమిని ఆవహించుకొనును. మధ్యలో అనేక ఆటంకములు ఏర్పడును. ఆపదలు వచ్చును. కాని అల్లాహ్ తఆలా అన్నిటిని మధ్యలో నుండి తొలగించును. తన వాగ్దానమును పూర్తి చేయును. అల్లాహ్ తఆలా నన్ను ఉద్దేశించి ఇట్లు తెలిపెను. రాజులు నీ వస్త్రముల నుండి శుభములు పొందు విధముగా నేను నీకు శుభము వెనుక శుభము ప్రసాదింతును.

కనుక ఓ వినువారు వినుము! ఈ విషయములను గుర్తుంచుకొనుము! ఈ భవిష్యవాణీలను తమ పెట్టెలలో భద్రపరచుకొనుము! ఇది అల్లాహ్ తఆలా వాఖ్యము. ఒక రోజు పూర్తి అగును."*(తజల్లియాతె ఇలాహియ్య : పుట 21–23)*

*......... సమాప్తం.............*

---

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి పట్ల హజ్రత్ మసీహ్ మౌవూద్(అ)కు గల అంకిత భావం ఈ క్రింద పేర్కొనబడిన వారి ప్రయత్నముల ద్వారా కూడ తెలుస్తుంది. వారు తమ మరణమునకు కొన్ని రోజుల ముందే "పైఘామే సులహ్" శాంతి సందేశపు నామముతో ఒక పుస్తకమును రచించిరి. ఆ రచనలలో హిందు ముస్లింల మధ్యగల సంఘర్షణ, విద్వేషమునకు మూల కారణం ధార్మిక విభేదాలని నిశ్చయించిరి. అంతేగాకా అన్ని ధర్మాల పండితులను, అవతారులను గౌరవించుటయే ఇస్లాం బోధనల సారంశమని కూడ వారు (అ) తెలియజేసిరి. ఫలితముగా వివిధ ధర్మాల వారి మధ్య సంధి కుదుర్చుటకు వారు (అ) తమ అభిప్రాయమును ఈ విధముగా వ్యక్త పర్చిరి.

"ఒకవేళ హిందువులు, ఆర్యులు మహా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారిని దైవ ప్రవక్తగా స్వీకరిస్తూ, ఇక ముందు వారిని వ్యతిరేకించకుండా, దుర్భాషలాడకుండా ఉండుటకు సిద్ధముగా ఉన్నచో అహ్మదీయులమైన మేము ఎల్లప్పుడు వేధాలను, ఉపనిషత్తులను, వారి పండితులను గౌరవిస్తూ, వారి పట్ల ప్రేమాభిమానాలతో వ్యవహరించు కొందుమని అందరి కన్న ముందు ఆ ఒప్పంద పత్రముపై సంతకము చేయుటకు నేను సిద్ధముగా ఉన్నాను. ఒకవేళ అలా ఆచరించని యెడల మేము మూడు లక్షల రూపాయలను జరిమానగా హిందువులకు చెల్లించెదమని తెల్పుచున్నాను. కావున హిందువులు స్వచ్ఛందముగా సంధిని కోరుచున్నచో వారు కూడ ఈ విధముగా ఒప్పంద పత్రముపై సంతకాలు చేసి ఇవ్వవలెను. ఆ ఒప్పంద పత్రములో వ్రాయబడు అంశం ఈ విధముగా ఉండవలెను. మేము హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి ప్రవక్తుత్వమును అంగీకరించెదము, మరియు వారి(స)ని దేవుని సత్య ప్రవక్తగా విశ్వసించెదము. ఇకపై వారిని గౌరవముగా పిలుచుకొందుము. మీరు గౌరవించినట్లే గౌరవించెదము. ఒకవేళ ఒప్పందము ప్రకారం నడుచుకొనని యెడల మేము కూడ మూడు లక్షల రూపాయలను అహ్మదీయులకు జరిమానగా చెల్లించెదము."

(పైఘామే సులహ్, పుట 25)

**126 వ ఖాదియాన్ వార్షిక బహిరంగ సభ దివి: 24, 25, 26, డిసెంబర్ 2021 ( శుక్ర, శని, ఆది వారాలు) తేదీలలో నిర్వహించబడును.**

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz